# ఆ రాత్రి

"On such a night as this-" (అన్ సచ్ ఎ నైట్ ఆస్ దీస్) అని ఆగాడు రాజయ్య ఉమ్మేసుకోడానికని కటికీ తెరిచి వెన్నెల వంక చూస్తో.

ప్రేమ ఎంతో అనవసరమనీ, అదో బూర్జువా జబ్బనీ, డబ్బూ, ఘనతా, కుటుంబాభ్యుదయమే ఆదర్శమనీ, ఎంత ఎందరు మొత్తుకున్నా వినక, ఆ కార్తీక మాసపు రాత్రి వెన్నెల-రాళ్ళని చలవరాళ్ళగా, మురుగు కాలవల్ని తేటనీటి సేలయేళ్ళుగా, చీకటి గొందుల్ని ఆకాశ మార్గాలుగా, చివరికి అభ్యుదయాసక్తమైన ఇరకు హృదయాల్ని కూడా కలలోకి చిగిర్చేట్టు చేస్తోంది. అదేమీ గమనించ తలుచుకోని ఇద్దరు self made successful (సెల్ఫ్‌మేడ్ సక్సెస్‌ఫుల్) కుటుంబీకులు చలిగాలికి దడిసి తలుపులు వేసి కుర్చీలో పడుకున్నారు. ఒకాయన చుట్ట కాలుస్తున్నాడు. ఇంకో ఆయన కబుర్లకి ఉద్యుక్తు డౌతున్నాడు. జీవితాన్ని స్వంత శ్రమ వల్ల విజయవంతం చేసుకున్నంత భరించరాని మనుషుల్ని చూడడం కష్టం. బైటికి చాలా polished (పాలిష్డ్) పెద్దమనుషులే,. కాని వాళ్ళ దుర్మార్గం భార్యల మీదా, పిల్లల మీదా, వారిమీద ఆధారపడే వారిమీదా, యాచించ వచ్చిన మనుషులమీదా కనపడుతుంది. ఆజ్ఞలు పెట్టరు, దడిపించరు, వ్యక్తి స్వేచ్ఛా అనీ మాట్లాడుతారు. వారికి ఏ విషయమైనాసరే తీర్చి, కొలిచి, అంచులు చెక్కిన అభిప్రాయాలు. దేవుడు, సంఘ సంస్కారం, యోగులు, ధనోపయోగం, మర్యాద- వీటిల్లో వారినుంచి భేదాభిప్రాయాలకి వారి సంసారాల్లో చోటివ్వరు. మిత్రులలో చాలా మార్జిన్ వొదిలి వొప్పుకుంటారు. కాని తమవారు అనేవారిలో సహించరు. వారితో వాదించరు. తాము స్పష్టంగా నమ్ముతారు. తాము నమ్మేదే సరైన సంగతి అని, ఆ అభిప్రాయాలతో వాతావరణాన్ని నింపుతారు. కందిపచ్చడిలో వెల్లుల్లిపాయ వేయవచ్చునా కూడదా అనే ప్రశ్నకూడా రాదు. వెయ్యకూడదు అని తోస్తే, అంతే. రెండో రుచికి ఆ యింటో చోటు వుండదు. వెయ్యావొద్దని అనరు కాని వెయ్యడానికి ఎవరికీ గుండెలు వుండవు. పిల్లలు ఏ విధంగా వర్తించాలో భార్యకి ఆదేశిస్తారు. "నాన్నగారికి ఇష్టంలేదు" అంటే చాలు దేవుడికి ఇష్టంలేదన్నమాటే. బీద విద్యార్థులూ, ముష్టివాళ్ళూ, పండితులూ యాచనకి వొస్తే, లెక్చర్లిచ్చి, అట్లా యాచించడం ఎంత నీచమో, తాము యాచించకండా అంత ఘనతకి ఎట్లా రాగలిగారో తమ స్వీయచరిత్రని చెప్పి పంపిస్తారు. జీవితం ఏ ఒడుదుడుకూ లేకుండా సాగాలి. కలవారి మనసు చాల సుకుమారం. ఏ పిల్లగాని, ఎవరుగాని ఏదన్నా కలవరం కలిగించారా, మాటలాడని ఆగ్రహంతో ఆ పిల్లని గిజగిజ లాడిస్తారు. ఆయన తన గదిలో కోపంగా కూచున్నాడా ఇల్లంతా ఉష్ణజ్వాలలు సమస్తప్రాణుల్నీ ఉడికించేస్తాయి. దీంటో ప్రపంచోద్ధరణగాళ్ళు వుంటారు. వాళ్ళు దానిని గురించి వ్యాసాలేగానీ, అసలు కానీ వొదలరు. సంఘస్వరూపమే, ఆర్థిక విధానమే మారాలి అని బోధిస్తో వుంటారు. పైపై స్నేహానికి సరదాగా వుంటారుగాని, లోపల కుష్ఠురోగుల

శరీరం నయం, వాళ్ళ ఆత్మలకంటె. వాళ్ళ మామూలు నమ్మకాలకీ, మనోశాంతికీ భంగంకలిగించే మహిమలు గాని, వింతలుగాని ఉన్నాయని, తమకన్న ఉదారమైన, ఉన్నతమైన శక్తులున్నాయని వింటే వాళ్ళు విషంగా నవ్వుతారు. బుద్ధిహీనులు నమ్మకాలంటారు. వాటి సంగతి తమకేమీ తెలీకపోయినా, అవి జిత్తులవి వాటి వెనుక వుండే రహస్యాల్ని వూహించి విశదం చేస్తారు. కవిత్వం, ప్రణయం, యోగం, త్యాగం, ఇవి కనపడ్డాయా-మండిపడతారు. ఏవో ఆదర్శాలు పెట్టుకుని జీవితాల్ని ధ్వంసం చేసుకునేవాళ్ళ మీద చాలా అసహ్యం, తృణీకారం.

చేష్టలోగాని మాటలోగాని ఎప్పుడూ తమని మరిచొ ఒక ఉద్రేకంలోకిగాని ఉత్సాహంలోకిగాని పోరు. జాగ్రత్తగా సరిచూసుకుంటో, తోవ తడుముకుంటో, లెక్కలు వేసుకుంటో, బలువుగా, లావుగా పందికొక్కుల మల్లే జీవితంలో కన్నాలు చేసుకుంటో పోతోవుంటారు, దొలిచిన మట్టి నంతా ఎవరికీ కనపడకుండా వెనక్కి తోసుకుంటో. జాగ్రత్తగా రుచిగా తమ రూల్సు ప్రకారం వంట చేయించుకుని పొట్టనిండా తినడమూ, పని చూసుకోడమూ, రాత్రి లెక్క ప్రకారం సంసారం చెయ్యడమూ-ఇంతే దినచర్య. వాళ్ళ సుకుమారం హృదయాలకి అయిష్టమైన మాటగాని, పేరు గాని, ఉద్దేశ్యంగాని, వినపడకూడదు. వీరి ఉద్దేశ్యాలను శిరసావహించి, ఇంకోవిధంగా గాలి పీల్చుకోడానికి కూడా భయపడే భార్యా, పిల్లా, తల్లీ, అత్తగారు, తమ్ముడూ, కోడలూ ఆ ఉద్దేశ్యాలే, అభిరుచులే చాలా గొప్పవనీ, సరైనవని నమ్మి, వాటిని చూసుకొని గర్వపడతారు. వాళ్ళట్లా గర్వపడేటట్టు చేస్తారు ఈ సమర్థులు. ఏదైనా విరుద్ధాభిప్రాయం ఇతరు లెవరిద్వారా నన్నా ఇంట్లో ప్రవేశించిందా వెంటనే సునాయాసంగా దాన్ని హత్య చేస్తారు. విషంగా నవ్విగాని, కనుబొమలు ముడిచిగాని, "ఇంక చాలు. ఈసారి ఆ మాట వినబడనీకండి" అనిగాని.

అన్నీ హద్దులు. ప్రేమగాని, స్నేహంగాని, పరిచయంగాని, డబ్బుగాని-'ఇంతవరకు' అంతే అని, అంచులు చక్కగా కత్తిరించినట్లు సంబంధాలు పెట్టుకుంటారు. వాళ్ళకి కోపం ఎన్నడూ రాదు. పైకి కనపడదు. నవ్వుతోనే గొంత్తుకత్తిరిస్తారు ఆ తెగిన మనిషే భరించలేక వొచ్చి వాళ్ళ ముందే గోలెత్తితే 'అట్లాచేస్తే ఇట్లానే జరుగుతుంది" అని తమకి సంబంధం లేనట్టు, ఆ శిక్ష ఈశ్వరుడి చట్ట ప్రకారం వాళ్ళమీద పడ్డట్టు మాట్లాడతారు. వాళ్ళకే అపాయమూ రాదు. అపాయాలు, నష్టాలు, దురదృష్టాలు పట్టిన వాళ్ళమీద వాళ్ళకి స్వశక్తి మీద విశ్వాసం. ఈశ్వరుడంటే వాళ్ళకేమాత్రమూ గిట్టదు. వేరె శక్తి చాలా అనవసరం వాళ్ల అవసరాలకి.

దూరంనించి అపాయం వొస్తున్నట్లు తోచిందా, చల్లగా తప్పుకుని పక్కవారి మీదనించి అపాయాన్ని దొర్లి పోనిస్తారు. ఇంకెవరూ లేకపోతే భార్యమీదనైనా సరే-. ప్రియురాలు అసలు వుండనే వుండదు, ప్రేమ అంటే హేళన గనక. ప్రేమని ఎరగనే ఎరగవు ఆ హృదయాలు. ఏ ఉద్రేకం వల్లనన్నా మనిషి కదిలి పట్టాలు తొలిగాడా, దాన్ని ఓ రోగ మంటారు.

ఆ రాత్రి ఆ గదిలో కుర్చీలో పడుకున్న పెద్దమనుషులిద్దరూ typical self-made men, కాని వాళ్ళిద్దరి జీవితాల్లోనూ స్త్రీమీద మమత ప్రభావం బలంగా పనిచెయ్యడంవల్ల ల్రైపునించి భేదించారు చెరో విధంగాను. ఎటువంటి స్త్రీ అయినా సరే, ప్రేమించిందంటే, ఆ పురుషుడి స్వభావంలో, అతను మొత్తంమీద ఎంత నీచుడూ, క్రూరుడైనా, ఒక భాగానికి ఓ ఔన్నత్యం పట్టి వుంటుంది. ఆ ప్రేమే పట్టుగా కొంతకాలం వాళ్ళ జీవితాల్ని పరిపాలిస్తే క్రమంగా పెద్దమృదువైన మార్పు కలుగుతుంది. ఎటువంటి కర్కశ స్వభావంలో కూడా కొంత విశాలత్వం ఏర్పడుతుంది.

ఆ గదిలో ఆ రాత్రి పదకొండు గంటలప్పుడు కుర్చీలలో హాయిగా పడుకున్న మిత్రులు ఇద్దరూ వయసు మళ్ళినవాళ్ళే. చిన్నప్పుడు స్కూలులో కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఆ యింటి యజమాని రిటైరై కాలేజీ లెక్చరరు శ్యామారావు. ఆయన అతిథి మిత్రుడు, చాలా డబ్బు సంపాయించిన వకీలు రాజయ్య. కాలేజీలో విడిపడి, ముప్పై ఏళ్ళ చిల్లర తరువాత ఇదే కలుసుకోడం వాళ్ళు. రాజయ్య తన కూతురుకి సంబంధం చూడ్డానికి ఆ వూరు వొచ్చి తన మిత్రుడి ఇంటో దిగాడు. రెండోరోజు రాత్రి అది.

చుట్ట కాలుస్తూ ఉమ్మేసుకోడానికని లేచి రాజయ్య "On such a night as this (ఆన్ సచ్ ఎ నైట్ ఆస్ దిస్)-జ్ఞాపకముందా ?" అంటో వొచ్చి కుర్చీలో పడుకున్నాడు, పై కప్పువేపు పొగ వదులుతో. కొంచెంసేపు మాటాడలేదు ఎవరూ. నిశ్శబ్దం నాలుగు నిముషాలే. కాని ఏళ్ళ జ్ఞాపకాలు !

పక్కన రైలుకట్ట. దానిమీద వంతెన కిందనించి దొల్లుకుంటూ ఒచ్చే పంటకాలవ. వెన్నెట్లో ఆ నీళ్ళన్నీ పాలైనాయి. కాలవకట్టన పొగడచెట్టు. దానికింద ముగ్గురు మిత్రులూ సహాధ్యాయులూ అట్లాంటి కార్తీకపు వెన్నెల రాత్రి-మధ్య విశాలాక్షి. చెరొక పక్కనా వీళ్ళిద్దరూ హుషారైన యువకులు-ఎన్నేళ్ళకిందటో. ఆ రాత్రి ముగ్గురూ తోడి రాగంలో పాడారు. షేక్సుపియర్ ఇంగ్లీసు పాటని- ూఅ ంబఝ్ష్మ ఖ అఱ్తఱ్త్ర ఖర్ త్త్రఱం- (ఆన్ సచ్ ఎ నైట్ ఆస్ దిస్) అని తప్పులతో ముగ్గురూ కంఠాలు కలిపి. కాని రెండు కంఠాలు కలవడం సులభంగాని మూడు కలవ్వు.

అసలు మొదట శ్యామారావుకి విశాలాక్షికి స్నేహం. చదువుకునే స్త్రీలని స్వతంత్రు రాళ్ళైన వారినీ చూస్తే అతనికి ఫాంటసీ అందుకని ఆమెకి తన నోట్సు యివ్వడమూ, ఆమెకి చదువు విషయమై సలహాలివ్వడమూ అతనికి సరదా. శని ఆదివారాలు ఆమె యింటికి వెళ్ళి ఆమెని 'కోచ్' చేసేవాడుకూడా. అతని ఆప్తమిత్రుడు రాజయ్యకి ఇట్లాంటి స్నేహాలు ఏ మాత్రం గిట్టవు. కనుక మిత్రుణ్ణి వార్న్ చేసి వారించాలని చూశాడు. కాని శ్యామారావు వినలేదు. త్వరలో విశాలాక్షి శ్యామారావుల పేర్లు గోడలమీది కెక్కాయి. వాళ్ళ పెద్దవాళ్ళకి ఆకాశరామన్న ఉత్తరాలు వెళ్ళాయి. దాంతో వాళ్ళిద్దరికీ చాలా సిగ్గేసింది. తమ స్నేహాన్ని ఇట్టా అసహ్యంగా ప్రచురిస్తారని వాళ్ళెప్పుడూ అనుకోలేదు. విశాలాక్షి కాలేజీకి

రాలేదు వరసగా నాలుగు రోజులు. శ్యామారావుకి దిగులు పట్టుకుంది, తన మూలంగా విశాలాక్షిని చదువు మానిపించారేమోనని. అంతేకాదు, ఆమెని చూడకుండా ఉండలేనని అప్పుడే తెలియవచ్చింది.ఆమెని ఆమె తలిదండ్రులు ఏం బాధ పెడుతున్నారో! ఓ సాయంత్రం శ్యామారావు వాళ్ళ యింటి వేపు వెడితే, విశాలాక్షి తండ్రి అతన్ని ఇంక ఆ యింటివేపు రావొద్దని కఠినంగా చెప్పాడు. శ్యామారావు డెస్పరేట్ ఐ తన మిత్రుణ్ణి విశాలాక్షి ఎట్లా వుందో చూసిరమ్మని బతిమాలుకున్నాడు. చివరికి మిత్రుడి అవస్థని భరించలేక వెళ్ళడానికి వొప్పుకున్నాడు, శ్యామారావు ఓ ఉత్తరం కూడా యిచ్చాడు. రాజయ్య రాత్రి కానిచ్చి వెళ్ళి విశాలాక్షిని పిలిచాడు. వాళ్ళ యింట్లో కొంచెం మాటాడి ఉత్తరం ఇస్తోవుండగా విశాలాక్షి తండ్రి చూసి ఎవరో సరిగా గమనించకుండానే ఉత్తరం లాక్కుని, "నిన్ను ఇటు రావొద్దని చెప్పలేదురా? నా పిల్లని బతకనియ్యవా?" అంటో మెడపట్టుకుని గెంటాడు రాజయ్యని. అర్భకుడైన రాజయ్య హఠాత్తయిన ఆ తోపుతో గుమ్మంలో కింద పడ్డాడు. రాత్రి పదింటికి శ్యామారావు గదికి వొచ్చి రాజయ్య తనకి జరిగిందంతా చెప్పాడు. ఆనాటి నుంచి వాళ్ళిద్దరి స్నేహమూ మరింత బలపడ్డది కాలేజిలో.

* * *

ఈ రాత్రి, వాళ్ళిద్దరూ పూర్వం ఇలాంటి రాత్రే వాళ్లు ముగ్గురూ కూచుని పాడిన సంగతి జ్ఞాపకం తెచ్చుకుంటున్నారు.

శ్యామారావు అన్నాడు ;

"అదొక్కసారే ననుకుంటా నువ్వు విశాలాక్షితో స్వేచ్ఛగా కూర్చున్నది, కాలేజీలో చూడడంకాకండా?"

అనుమానిస్తో చిన్న సిగ్గు చిరునవ్వుతో రాజయ్య 'ఊఁ' అన్నాడు. ఆ చిరునవ్వుని ఆ దీపం వెలుతురులో చూడలేదు శ్యామారావు.

"అది రామయ్యనాయుణ్ణి పెళ్ళిచేసుకుంది. మునిసిపల్ కౌన్సిలరు కూడా అయిందని విన్నాను, తరువాత నేనూ చూడలేదు. నువ్వు చూశావా?"

లేదు అని తలతిప్పాడు రాజయ్య.

"ఆ రోజుల్లో నీ సహాయం నాకు ఎంత బలమిచ్చిందో, అంతా జ్ఞాపకముంది. పాపం, నీకు ముట్టిందల్లా ఆ తండ్రినించి చివాట్లు.

"నీకు మాత్ర ముట్టిందేముందిలే!"

"ఎంత సినికల్‌గా మాట్లాడుతున్నావోయ్. ఏమన్నా ముట్టాలా? ఆ లెక్కలన్నీ మన హృదయాలమీద జీవితపు మురికి పేరుకున్న తరువాత. కాని ఆ యవ్వనంలోమొదట ఓ

యువతిని ప్రేమించగలగడం-ఆమె నించి ఒక్క చిన్నచూపు, చిరునవ్వు-అవన్నీ ఎంత అమూల్యం!"

"ఏం విరహపడేవాడివి!"

"చెప్పుకోవడానికి నువ్వు లేకపోతే అంత విరహపడేవాణ్ణి కాదేమో! నీ కట్టాంటి గొడవలు ఏమీ వుండేవి కావు. అదృష్ట వంతుడివి."

"ప్రేమించడమే అదృష్ట మన్నావుగా !" అన్నాడు రాజయ్య నవ్వుతో.

"అవునులే. కాని ఎంత గొడవ అంటావు ! ఆ నాటి ప్రేమ నా జీవితం మీదనే ఓ మబ్బుని కమ్మేసింది."

"అదేమిటి?"

"ఓటి చెప్పు రాజయ్యా ! సిగ్గు పడకు. నువ్వు ఏకపత్నీ వ్రతుడవా?"

"ఛా! ఏ మాత్రం కాదు. ఎంత మాటన్నావు నన్ను!"

"ఎవరిమీదనన్నా ప్రేమ వొచ్చిందా?"

"ఏమిటో! ఆ ప్రేమ అంటే నాకు సరిగా తెలీదోయ్. ఇష్టాలు వొస్తాయి. అదీ ప్రేమేనేమో! ఎప్పుడూ తోటకూర పులుసు కూరతోనే తినగలవా? చాపలుకావాలనిపించదూ? అట్లా!"

"అంటే నువ్వు ప్రేమ నెరగవు. విశాలాక్షి నీకు జ్ఞాపకం వుందా బాగా యిప్పటికీ?"

"ఊఁ" అన్నాడు రాజయ్య.

రాజయ్యలో విశాలాక్షి సంగతి మాట్టాడ్డానికి సరదా ఏమీ కనిపించలేదు శ్యామారావుకి. ఇన్నేళ్ళ తరువాత ఆమె సంగతి నెరిగి తనతో మాట్లాడ గలిగిన మిత్రుడు దొరికాడు. ఆ జ్ఞాపకం పైకి వచ్చినకొద్దీ మాట్లాడాలని పొంగిపోతున్నాడు అతను. రాజయ్యకి ఇంకా ఆమెమీద కోపం పోనేలేదా, లేక ఆమెని మరచిపోయినాడా?

"నేను ఏకపత్నీ వ్రతుణ్ణి" అన్నాడు పైకి, శ్యామారావు.

"ఎందుచేత ?"

"వ్రతం కాదనుకో. కాని విశాలాక్షి జ్ఞాపకం మూలాన ఇంక ఏ స్త్రీని తాకలేక పోయినాను దాని అందం, మాటల వొడుపు - నీకేం తెలుసు అదంతా?కాలేజీలో చూడడం తప్ప దాన్నేం ఎరుగుదువు?"

"ఎరగడం ఎందుకు? దానికన్న అందమైన వాళ్ళు ఎంతమందో!"

"అదే ప్రేమ చేసే దుర్మార్గం. ఎంతో అందమైనవాళ్ళు వుండవొచ్చు; కాని అందంగా కనపడరు."

"మరి భార్యా?"

"భార్య వేరు, భార్యని ప్రేమించడమూ అదీ పశ్చిమదేశ వ్యవహారం మనకి ప్రేమతో నిమిత్తం లేదు ధర్మం. ఇష్టం కూడా అవసరం లేదు. మామూలు రొటీన్ వ్యవహారం. కాని ఒక్కసారి గట్టిగా ప్రేమించామా ఇంక మళ్ళీ ఎవరినీ తక్కువవారిని ఇష్టపడలేము. విశాలాక్షి నా జీవితాన్నట్లా చేసేసింది. ఒక స్త్రీ వ్యవహారంలోనే కాదు జీవితం మీది ఆసక్తినే చంపేసింది నాలో."

"అదేమిటి?"

"అవును. ఆమె లేనిది ఎందుకు జీవించడం? ఏ సౌఖ్యమన్నా, ఏ అదృష్టమన్నా ఆమె పంచుకోనిది వ్యర్థం అనిపించింది ఇన్నేళ్ళూ"

"అంత లోతుగా వుంటుందన్నమాట ప్రేమ అంటే? ఎన్నేళ్ళానాటి సంగతి!" అని నవ్వాడు రాజయ్య.

"మీ కర్థం కాదులే. ఆమె జ్ఞాపకమే లేకపోతే ఇంకా ఉత్సాహంగా పట్టుగా ఉద్యోగం చేసి వుందను. ఎన్నేళ్ళకీ ఈ లెక్చరరుగానే ఉండిపోదు ననుకున్నావా?"

"ఇన్నేళ్ళలోనూ మధ్య మధ్య ఓసారి ఆమె ఎదిగి ఎట్లా తయారవుతోందో చూస్తే చాలవరకు కుదిరిపోయేదేమో నీ ప్రేమ పిచ్చి?"

"చూస్తేనేం?"

"ఇన్నేళ్ళ తరవాత ఇంకా ఆమె రూపం జ్ఞాపకముందా నీకు? ఉంటే ఇంకా పద్దెనిమిదేళ్ళ బాలా కుమార్తెగానే చిత్రించుకుంటో వుండి వుంటావు దాన్ని-అవునా?"

"సరిగ్గా చెప్పావు. అవును, చిత్రంగా ఈనాటికీ ఆమె ఆనాటి నవ్వుతో, సూటిగా కళ్ళలోకి చూస్తో అట్లానే వుండిపోయింది ఈ రోజు ఆమెను గుర్తుపట్టగలను, ఆ రూపంలోనే ఆమె కనపడితే."

"ఆ రూపం ఆధారమేగాని, అసలు నీకు జ్ఞాపకమున్న దల్లా నీ ప్రేమేననుకుంటా"

"అదీ చిత్రమే కదా! ఆలోచిస్తే నేనేమనుకుంటా నంటే మా సంబంధం ఈ జన్మది కాదేమో, ఎన్నజన్మలనించో ఇట్లా కలుసుకుంటో విడిపడుతోనే వున్నానేమోనని."

"పునర్జన్మలూ అవీ నమ్మకమా ఏమిటీ నీకు?"

"కాదా? నీకు లేదా? జన్మలు లేవంటావా? లేకపోతే చచ్చింతరవాత ఏమౌతా మంటావు."

"నేనేం ఆలోచించ లేదనుకో. కాని ఏమిటో మళ్ళీ మళ్ళీ పుట్టడం, మనుషులు, కుక్కలూ, పిల్లులూ, కావడమూ అదీ చాలా మూఢనమ్మకంగా కనపడుతుంది."

"నాకట్లా అనిపించదు."

"నువ్వు వృథాగా ఏదో వూహించుకుని, నీ జీవితమంతా చెడకొట్టు కున్నావు. ఆమె నీ నించి ఇంత త్యాగానికి అర్హురాలని ఎందుకు అనుకున్నావు? తక్కిన స్త్రీలవంటి స్త్రీ, కొంచెం పెద్ద కళ్ళూ, పెద్ద రొమ్మూ వుండగానే, ఆమె ఏదో లలనా శిరోమణి అని ఓ ఆలయం కట్టుకున్నావు నీ హృదయంలో అసలు నువ్వేం ఎరుగుదువు ఇంతకీ?" అని దూకుడుగా లేచాడు రాజయ్య. కోర్టులో ఇట్లాంటివి ఎన్ని? ఈ లేచిపోయినవాళ్ళ కేసుల్లో వాళ్ళు మొదట్లో రాసుకున్న ఉత్తరాలలో ఆరాధనా, కోర్టుకెక్కిన నాడు బైటపడే వాస్తవమూ, ఆ ప్రియులు ఒకరి నొకరు తిట్టుకునే విధమూ వినాలి నువ్వు!" అని ముంగిచారు.

"సాధారణులలో నువ్వనేది నిజం కావొచ్చు. ఆమెలో ఏదన్నా గట్టి లోపం వుంటే నావంటివాడి మనసు ఆమెలో ఇన్నేళ్ళు అట్లా కాదనుకో."

"దుష్యంతుడి మల్లే మాట్లాడకు. ఈ కావ్యాలు చదవడం వల్ల వచ్చిన ముదనష్టమే అది. ఆనాడు వీరకార్యదక్షుడు డాన్‌క్విక్సొట్ ఒకడే కాని, యీనాడు ప్రేమ కావ్యాలు చదివి తాము మానవాతీత శృంగార మూర్తులమని మోసపోయే ప్రేమ క్విక్సొట్లు వందలు. వాళ్ళల్లో నువ్వ వొకడివి. ఇంతగా ఇట్లా అయినావనుకోలేదు ఇన్నేళ్ళూ. ఈ సంగతే తెలిస్తే నిన్ను యీ మాయనించి తప్పించేవాణ్ని."

"ఎట్లా?"

"ఈనాటికీ అట్లానే ఉన్నావా?"

"ఊఁ. ఈ జన్మకే కాదు ఏ జన్మకైనా ఇంతే."

"విచిత్రం. నువ్వు దాంతో ఓ ఆర్నెల్లు కాపంర చేస్తే కుదిరిపోను ఈ పిచ్చి."

"మామూలు స్త్రీలతో అంతేననుకో, ఆమెతో కాదు. అనేక ఏళ్ళు ప్రేమ ప్రజ్వలంగా వెలిగిన దాంపత్యాలు లేవంటావా?"

"నిస్సంశయంగా లేవు. ఒక్కటి చూపించు. ఎంతకీ ఏ కావ్యాలూ పెళ్ళి అయిన దాకానే. తరవాత ఏముంది?"

"సీతారాములు."

"ఏం మనకేం తెలుసు, అడివికి పంపించిన ఏడుపులు తప్ప? ఏ మొగుడైనా ఆ సందర్భంలో అట్లానే ఏడుస్తాడు. కవి గనక ఆ రాసిన వాడు అందంగా ఏడిపించాడు, పైగా అన్యాయం చేస్తున్నానని తెలుసు కూడాను. శ్రీరాముడికి! ఒకవేళ విశాలాక్షి వ్యభిచారి అని తెలుసు ననుకో నీకు-ఇంకా నీచమైన గుణాలున్నాయనుకో-ఈ వ్యామోహం అట్లానే వుండేదా?"

"తరువాత జీవితం సంగతి నాకు తెలీనూ తెలీదు, అక్కర్నే లేదు. కాని ఆ రోజుల్లో ఆమె దివ్యమూర్తిలో కళంకం ఎక్కడా లేదు."

"నీకెట్లా తెలుసు?"

"నువ్వు ఉత్త సినిక్‌వి. అట్లా సినిక్ ఐపోవడంకన్న, నా మల్లే విరహంలో కాలిపోవడమే వుత్తమం." అన్నాడు చాలా తృణీకారంతో శ్యామారావు.

రాజయ్య మాట్లాడలేదు. అతనికి కోపం హెచ్చుతున్నట్టుంది.

"ఏమంటావు? మాట్లాడవేం ?"

"అభిరుచుల్లో భేదం. పోనీ, అట్లా అనుకో."

"నీ నోరు మూస్తాను. ఈ సంగతి విను. మా పెద్దమ్మాయి బాల్యంలోనే వితంతు వయింది. చిన్నప్పటినించీ బళ్ళో చదువుకుంటోనే వుంది. దాన్నే 'కంటిన్యూ' చేసింది. కాలేజీలో ఇంకా ఆడపిల్లలు వుండేవాళ్ళుగా! వాళ్ళల్లో రమ అనే పిల్ల మీద దానికి ఏమిటో చెప్పలేని ఇష్టం. ఆ పిల్లని చూడకండా ఒక్కరోజు వుండలేక పోయేది. ఎప్పుడూ ఆ పిల్ల కబుర్లే. ఆ పిల్ల 'హిస్టరీ' శాఖ. అందుకని నేను చూడటం తటస్థించలేదు. ఆ రమా అంతే. మా అమ్మాయిని చూడకండా నిలువలేదు. దూరాన్నించి చూసే ఒకరినొకరు అంత ప్రేమించారట మా అమ్మాయికి జ్వరం వొచ్చినప్పుడు చూడ్డానికి వచ్చింది మా యింటికి రమ. ఆమెని చూడ్డంతోనే నాకు ఎక్కడ లేని ఆకర్షణా కలిగింది. ఆమెకూ నామీద అంతే. దాన్ని చూడంది, దాంతో మాట్లడంది ఒక్కరోజు ఉండలేకపోయేవాణ్ని. వొచ్చి చాలా చనువుగా నా పక్కన కూచునేది. మొదటినించీ నాకు ఆమెమీద తెలీకండానే కొంత మోహం వుంది. నా వయసెక్కడ, దాని వయసెక్కడ! పైకి మాత్రం మా అమ్మాయి మీద వుండే ఇష్టంలానే వుండేది. కాని ఎక్కడో భేదం-ఒకటే తాకాలని, బుజ్జగించాలని, ప్రెజెంట్లు యిచ్చి సంతోషపెట్టా లనిపించింది. ఏదో మాటల సందర్భంలో చెప్పింది. తన తల్లి పేరు విశాలాక్షి అని. తీరా చూస్తే ఆమె మన విశాలాక్షే ! యేమంటావు?"

చప్పున పైకి లేచి కూచుని శ్రద్ధగా వింటున్నాడు రాజయ్య. "తరువాత ?"

"తరువాత చెప్పాలంటే అది ఎట్లా చెప్పాలో తెలీటం లేదు. ఇదే నా నోటనించి రావడం ఆ సంగతి. సిగ్గుగా వుంది. అంతేకాదు. చాలా అందమైనదీ, గాఢమైనదీ - మాటలతో ఇతరులతో చెబితే - చాలా సార్లు ఆ చెప్పడంతోనే-వాళ్ళు వినడంతోనే మురికి ఐపోతుంది. కాని నువ్వు వేరు విను, రమ మా ఇంటో బాగా అలవాటయింది. చాలారోజులు మా ఇంటోనే వుండిపోయేది. మా ఇంటో కాలేజీ ఆడపిల్లలు తరుచూ వుండేవారు. తలిదండ్రులకీ, కాలేజీవారికి నాపైని చాలా విశ్వాసం-సునిశితమైన ఋజు ప్రవర్తన నాది అని."

"ఎందుకు ఆ విశ్వాసం?" అన్నాడు నవ్వుతో రాజయ్య.

"ఏమో?"

"వయసు వల్లనేమో!"

"కాదు- చిన్నప్పటినుంచి అంతే."

"నీ మొహంలోనే వుందనుకుంటా."

"కావొచ్చు. అదిగాక అప్పుడప్పుడు నియమాల్ని గురించీ, పవిత్రతా సంస్కరణా ఇట్లాంటివాటిని గురించి, విద్యార్థులకే గాక, కొంచెం పబ్లిక్‌లో కూడా మాట్లాడేవాడివి. ఇంక వేరే వారు యేమీ రాకపోతే, ఆ మాట్లాడడం ఎంత ఉపకరిస్తుంది!"

"అవును. అందులో అవినీతి ఎటో చాలా దూరాన నీచుల్లో వుండేట్టూ, మనది ఎక్కడో వినికిడే గాని, యేమీ తెలిసిన వ్యవహారం కానట్టూ మాట్లాడితే చాలు. నీతికీ, కార్యరక్టర్‌కీ, శీలానికి ప్రసిద్ధి కెక్కిన వాళ్ళంతా అట్లా మాట్లాడటంవల్లనే ఆ కీర్తిని సంపాయించారు. అసలు వ్యవహారానికీ, ఈ కీర్తికీ యేమీ సంబంధం లేదు. ఇట్లా గొప్ప కీర్తి సంపాయించుకున్నవారి చరిత్రలు మరణం తరువాత అద్భుతంగా బైటపడి, ప్రజలని అన్నేళ్ళు ఎంత బాగా వంచించారో చూపిస్తాయి. గ్లాడ్‌స్టోన్ సంగతి తలుచుకో. సరే నీ కథ కానీ."

"రమా మా యింట్లోనే వుండేది. మాకు స్నేహం ఎక్కువయింది. ఒకరోజున నా వొళ్ళో కూచుని, నా మెడచుట్టూ చేతులు వేసి యేదో మాట్లాడుతోంది."

రాజయ్య తలని చేతుల్లో పెట్టుకుని మూలిగినట్టు వినిపించి, ఆగాడు శ్యామారావు.

"యేమిటది?"

"యేంలేదే కానీ."

కాని, రాజయ్య కంఠంలో యేదో కలవరం.

"ఎట్లా చెప్పను? ఆమె చిన్న రొమ్ము నా రొమ్ముకి ఆనుకుంది. కావలిసే ఆనించిందా అని......"

"ఛస్. అలాంటిది కాదు ఆ పిల్ల."

"ఏ పిల్ల?"

"ఏం లేదులే కానీ."

"ఏమిటి, నువ్వా రమ నెరుగుదువా?"

"నాకు తెలీదు ఆ రమ ఎవరో! ఏమీ ఎరగని ఆడపిల్లని పట్టుకుని దానికి అట్లాంటి వుద్దేశ్యం వుందని ఆరోపిస్తే, నాకు కోపమొచ్చింది."

"కాదులే. నువ్వెరుగుదువు వొప్పుకో."

"ముందు నీ కథ కానీ."

"నే నేమీ ఆరోపించలేదు. నా అనుమానం నిజమని తేలింది. ఈ ఆడపిల్లలకి టీచర్లని, లెక్చరర్లనీ చూస్తే ఎంత ఆరాధన! చాలా సులభం దాన్ని ఇష్టమైన తోవలోకి తిప్పుకోవడం. అందుకనే యునివర్శిటీ కమిషన్‌లో ఆడపిల్లలకి ఆడ లెక్చరర్లే వుండాలని వాదించాను."

"సరే అదంతా ఏం జరిగింది అప్పుడు? ఏం చేశావు రమని?"

చాలా దూకుడుగా మాట్లాడాడు రాజయ్య.

"ఏమిటి సంగతి? నేను చెప్పను. ముందు నీ ఇంటరెస్టు ఏమిటో చెప్పు."

"చెపుతా తరువాత."

"నిజమేనా?"

"ఊ."

"నా వొళ్ళు ఏమయిందటావు?"

"రమ మీదనేనా నీకంత యిష్టం? కాక విశాలాక్షి కూతురనా?"

"అప్పుడు నాకు రమ విశాలాక్షి కూతురిని తెలీదు."

"ఎప్పుడు తెలిసింది?"

"తరువాత ఎప్పుడో, చెపుతాలే. ఏం చెపుతున్నాను?"

"ఏమైనావు అప్పుడు?

"ఏమైనాను? ఆ పరిస్థితిలో మొగవాడు ఏమౌతాడో అదే ఐనాను."

"ఐ?"

రాజయ్య ఊపిరి వినిపించలేదు.

"ఐ ఏం లేదు మెల్లిగా ఆ పిల్ల చేతులు నానించి తీసేసి తప్పించుకుని కబుర్లు చెప్పి పంపాను. కాని నా దేహమంతా ఆమె వేపు లాగింది."

"ఇంకేం?"

"కాని నా వయసెక్కడ! ఆ పిల్ల వయసెక్కడ!"

"వయసుతో పనేమిటి? ఏమన్నా పెళ్ళి చేసుకుంటున్నావా రమని?"

"దేనికైనానూ. నా అనర్. పాపం నన్ను నమ్మిన పిల్లని, ఏదో బలహీనమైన సమయంలో అడ్వాన్టేజి తీసుకోడం....."

"ఆ కబుర్ల కేం? ఏం చేసావో చెపుదూ?"

"ఏం చెయ్యలేదు."

రాజయ్య నిట్టూర్పు విడిచి కుర్చీలోకి వొంగాడు. శ్యామారావు అది చూడలేదు. పూర్తిగా గతంలో నిమగ్నుడై రాజయ్యనే మరచిపోయినాడు.

"తరువాత అంతా మిగిలిన రోజులన్నీ రమతో వొంటరిగా వుండకండా తప్పించు కున్నాను."

"అయిపోయిందా?"

"లేదు విను. శలవలకి రమ వాళ్ళ వూరు వెళ్ళినప్పుడు తెలిసింది నాకు మొదట-ఆమె మీద చాలా ప్రేమఅని. అందులో అది చాలా ఉన్నతమైన ప్రేమ అని."

"ఏమిటి? ఆ ప్రేమ ఏమిటి? అందులో ఉన్నతమైన ప్రేమ ఏమిటి? అంటే ప్రేమకీ, ఉన్నత ప్రేమకీ, పవిత్ర ప్రేమకీ వీటన్నిటికీ ఒకటేగా అర్థం?"

"ఏం అర్థం?"

"ఏముంది? అంతా ఒకటే వాంఛ. భేదమల్లా బట్టలన్నిటితోనూ, కొన్నిటితోనూ, అసలు లేకుండానూ. అంతే పవిత్ర ప్రేమకీ, పశుకామానికీ భేదం" అని నవ్వాడు రాజయ్య నిష్కల్మంగా.

"వూరికే వెక్కిరించకు సినిక్. నీకేం తెలీదు యీ విషయం. నీ అనుభవమంతా పచ్చి భోగంవాళ్ళతోమల్లే వుంది. ప్రేమ అంటే-అసలు ఆ పడక సంగతులు ఏమీ జ్ఞాపకం రావు. ఆ పిల్ల వూరికే నీతో వుంటే చాలునని పిస్తుంది. తెలిసిందా ఇప్పటికన్నా."

"తెలుసులేవోయ్. అవన్నీ కవిత్వం రాసే కుర్రకుంకల మాటలు. చేతికి అందనప్పుడూ, ఏవో అభ్యంతరాలున్నప్పుడూ, అట్లాంటి వెర్రికలలలోకి పోక అంతకన్న ఏం చేస్తాడు మనిషి? ఇద్దరు ప్రియులూ కలిశాక, మూడో మనిషి లేకండా ఇంత వరకు కవిత్వంగాని కథగాని వొచ్చిందా? అంతే. మొదట్లో తనకి కనపడితే చాలు నంటాడు. తరవాత తనవంక చూస్తే చాలు-తరవాత వేలు తగిలితే చాలు, తరవాత చెయ్యి తనమీద వేస్తే చాలు, తరవాత తన చేతిని మీద వేయించుకుంటే చాలు, ఇంకా ఆ చెయ్యిని జరపనిస్తే చాలు, దగ్గిరిగా పడుకున్నా ఆకాశవంక చూస్తే చాలు-తక్కిన steps (స్టెప్స్) యోచించుకో. ఆ కొసన ప్రారంభించి, కాలమూ వీలు దొరికతే, ఈ చివరికి రాని మనిషిని చూపించు. వాణ్ణి భుజాలమీద కూచోపెట్టుకుని దేశమంతా తిరుగుతాను."

"చూపిస్తాను. భుజాలమీద యెక్కించుకో."

"ఎవడు?"

"వీడూ."

"నువ్వా? నువ్వంత గొప్పవాడివని రూఢి ఐనప్పుడు అట్లానే ఎక్కించుకుంటాను. నువ్వుగాని ఎవరుగాని నేను చెప్పిందానికి విరుద్ధం కాదు. ముందు బట్టలన్నిటితోనూ కనబడితే చాలు. తరవాత? ఒక్కొక్కటే కొంచెంగా తొలిగి వీలులేనప్పుడు ఎక్కడెక్కడ

సందు కనపడితే దాంటోంచి, మెల్లగా ఒక్కొక్కటే తీసి, చివరికి ఏమీ లేకండా అక్కడితో ఆఖరు. ఇంక వెనక్కి తిరుగుతారు. ఒక్కొక్కటే కప్పడం ప్రారంభిస్తాడు. తరవాత అసలు చూడడు. దీపం అర్పుతో ఉంటాడు. భార్య విషయమై ఈ steps (స్టెప్స్) అన్నీ ఒక్క రాత్రిలోనే జరుగుతాయి గనక, రొమాన్సు చాల తొందరలో ముగుస్తుంది. తక్కిన వాళ్ళతో కొంత ఆలస్యం. అంతేనా, కాదా? కానీ నీ కథ."

"నువ్వట్లా వెక్కిరిస్తో వుంటే చెప్పా లనిపించిటంలేదు."

"అవును ఎందుకంటే - సహజమైన కామం, మనిషి దేహంలో చాలా కిందిభాగంలో వుంటుంది. దానికి సిగ్గులేదు. వెక్కిరింపులుగాని, భయాలుగాని అపనిందగాని దాన్ని ఆపలేవు కదల్చలేవు. నీవంటి వాళ్ళల్లోనూ, కవుల్లోనూ అది క్రమంగా తల్లోకి ఎక్కుతుంది. దాని విషం కళ్ళల్లోకి దిగి స్త్రీలలోని అందాన్ని కల్పిస్తుంది. ఈ తలలోని కామానికి సిగ్గు, అది అబద్ధం అసహజం కనక వెక్కిరింపుకి తట్టుకోలేదు."

"లారెన్సు పుస్తకంలోమల్లే మాటాడుతున్నావు"

"ఎవరి పుస్తకంలోది కానీ నిజం. కానీ నీ కథ, నవ్వనులే."

'రమకి ఉత్తరం రాశాను - ఆమె లేనిదే ఉండలేననీ, త్వరగా రమ్మని, ఏమనుకుంటుంది అనే యోచనకూడా లేకండానే. రెండురోజుల్లో వొచ్చింది. ఓ తెల్లారకట్ట సరాసరి నా పక్క దగ్గిరికి వొచ్చి, కలలోమల్లే నిద్రపోయ్యే నా చెంపమీద చెయ్యేసింది కళ్ళు తెరిస్తే నవ్వుతో రమ. నాకు ఇంకా నిద్ర. ఆమె చేతులు పట్టుకున్నాను ..... ఎందుకు నవ్వుతున్నావు?"

"తక్కింది నేను చెప్పనా. నీ పవిత్ర ప్రేమ ఏం చేసిందో?"

"వుండు." శ్యామారావు తన కళ్ళ ఎదటికి పిలుచుకుంటున్న దృశ్యంలో లీనమైనాడు.

"ఆమె నా మీదికి వొరిగింది. దగ్గరికి తీసుకున్నాను. ఏ స్టేజీలో నన్నా ఆమె అభ్యంతరం కనపరచాలని నా ఆశ......"

"నీ భయం."

"కాదు-నిశ్చయంగా కాదు."

"అవునులే. రెండూ కలిసే వుంటాయి. ఆమె శీలం నీ శీలాన్ని రక్షించాలని. అట్లా కాదా, చివరికి నింద కొంత వరకన్నా ఆమె మీద వెయ్యవచ్చు. అలాంటప్పుడు మగవాడు అంతకన్న ఏం చేస్తాడని!"

"కాదు. విను, ఆమె కళ్ళే మూతలుపడ్డాయి. ఇంకా నా దగ్గిరిగా వొత్తుకుంటోంది. నేను నవ్వుతో, ఆటమల్లే, ఆమె జాకెట్టు గుండీల్ని విప్పుతున్నాను. ఎండపడని, గాలికూడా గట్టిగా తగలని ఆమె రొమ్ము రంగు నా తల తిప్పింది. తరవాత....."

"ఎందుకు ఆగావు?"

"ఏం లేదు. నువ్వు చెప్పిన స్టెప్స్ అన్నీ వరసగా....." అని నవ్వాడు శ్యామారావు సిగ్గుతో.

రాజయ్య బిగ్గరగా నవ్వాడు.

"ఏమిటోయ్ ఆ సిగ్గు! మామూలు సెడెక్షన్‌ని ఏదో మహాయజ్ఞలాగు. ఏదో అపురూప కళ్యాణ మహోత్సవంలాగు మాటాడుతున్నావు. ఎవరూ ఎరగనిదీ, నీకే ఎట్లానో జరిగిన విషయం లాగూ! ఏమన్నా చలంగాలి సోకిందా ఏం?"

"సరేలే. ఆమె ఉద్దేశ్యం తెలుస్తోంది, చివర అంటే-"

"తెలిసిందిలే."

'ఆగాను. ఎందుకు ఆగానా అని కళ్ళు తెరిచింది. అప్పుడు తట్టింది, నేను చేస్తున్న ఘోరపాపం నా మనసుకి, చప్పున మంచం మీద నించి లేచి నుంచున్నాను.

టెన్షన్‌తో వింటున్న రాజయ్య తెప్పరిల్లాడు. రిలీఫ్‌తో నిట్టూర్పు విడిచాడు.

"దీనికా నిన్నుభుజాలమీద మొయ్యవలసింది? నీ బుజాలు నే నెక్కడానికి కూడా పనికిరావు. పాపం! ఎంత నీచమైన పని చేశావు! ఏమై వుంటుంది ఆ పిల్ల ? ఆ మర్నాడే నిన్ను వదిలి వెళ్ళిపోయింది కదూ ?"

"అవును. నీ కెట్లా తెలిసింది?"

"అంతకన్న ఏం చేస్తుంది?"

"నీచమైన పని చేశానంటావా."

"వేరే అడుగుతావా?"

"ఇన్నాళ్ళూ చాలా ఘనమైన కార్యం-గొప్ప ఉదారత్వంతో-నన్ను నేను నిరాకరించుకున్నా ననుకుంటున్నాను. నువ్వు అన్నదే నిజమేమో? ఆ నిమిషాన ఆమెని గాయపరిచాను. తరవాత రమ నా మొహం చూడలేకపోయింది కాని నాకే ఆ నిగ్రహశక్తి ఆ నిమిషాన రాకపోతే ఆ పిల్లగతి ఏమయ్యేది ?"

"ఏమయ్యేదో! కాని ఇప్పుడేమయింది. ?"

"ఏమయింది?"

"ఏమయిందో నీ కెందుకు? నీ నిగ్రహం నీకేగాని !"

"ఏదో నీ కామం నీకేగాని ఆ పిల్ల గర్భవతి ఐతే నీకేం అన్నట్టు మాట్లాడుతున్నావే!"

"అవును. నీతి అవినీతులే చూస్తారుగాని, నీతి పేర ఎంత స్వార్థం చలామణి అవుతుందో ఎవరికి తెలుసు? నువ్వే ఆ పిల్ల జీవితాన్ని రక్షించగలిగానని, ఎంతో నిగ్రహం

చూపానని గర్వంగా నీ బుజాలమీద నువ్వు తట్టుకుంటున్నావు, ఇన్నేళ్ళూ. అంత మానవాతీతుణ్ని నేనే కదా, ఇంకోరు అంత స్వార్థరహితులు వుంటారా అని, బహుశా ఈశ్వరుడు కూడా నిన్ను గౌరవిస్తాడనే నీ నమ్మకం. కాని నిన్ను రక్షించుకున్నావు. ఆ వొక్క పనీ చివరిదాకా జరిగితే, దాంతో నీకూ ఆ పిల్లకూ లంకె పడేది. వొదలలేవు. వొదుల్చుకోలేవు. నేరం చేశాననే బాధ. ఈ పిల్ల భవిష్యత్తు బాధత్య. వొదుల్చుకుంటే ఆ నేరం భారం. ఉత్త స్వార్థపరుడివి. ఆ పని చెయ్యనందుకు నీది మహా పవిత్ర ప్రేమ!"

"సరేలే. నా వయసు, ఆ పిల్ల వయసు? పెళ్ళి కాని పిల్ల. నేను స్వార్థపరుడిని అని నన్ను అన్యాయంగా....."

"తిరిగి ఆ అమ్మాయిని నువ్వు కలుసుకున్నావా."

"పెళ్ళయినాక ఓ కూతురు పుట్టాక ఓసారి ఆమె భర్తా, ఆమె, నేను రైల్లో కలుసుకున్నాము. నేను గట్టిగా అడిగితే ప్రయాణం మధ్యలో ఆగి మా ఇంటో ఓ రోజు ఉన్నారు."

"ఎట్లా కనపడ్డది?"

"మామూలుగానే. ఎదిగింది. ఏదో శాంతంగా వుంది."

"అంతేలే. అంతకన్న ఏం తెలుసుకోగలవు? తాము ఉత్తములు అనుకునే మనుషులంత గుడ్డివాళ్ళూ, స్వార్థపరులూ వుండరు."

"సరేలే. ఆమెకేం అపకారం జరిగింది? సుఖంగా పెళ్ళి చేసుకుంది తనకి ఈడువాణ్ణి. పిల్లల్ని కన్నది."

"అట్లానే సమర్థించుకుంటారు."

"నాతో ఆమె బతుకేమిటి?"

"ఆమెతో నీ బతుకేమిటి? అది ఎత్తవేం?"

"అవును. ఘోరమే. కాని ఆమెని రక్షించానా లేదా?"

"అవును. ఓ విధంగా రక్షించారు, నిన్ను రక్షించుకుని. కాని ఇంకో విధంగా నీకూ ప్రపంచానికి కనపడని విధాన....."

"నీ కెట్లా తెలుసు?"

"చెపుతా తరువాత అక్కడితో ఆమె చదువు ఆఖరు. ఆ దెబ్బతో ఇంకో మొగాడి చేతుల్లో పడ్డది. ఆ అనుభవంతో నిర్బంధపు అవసరపు పెళ్ళి. ఆ సంసారం వుత్త నిస్సారమయింది. దీనికంతా మొదటి కారణం గడ్డకట్టి పేరుకున్న నీ స్వార్థం."

"నాదా! రెండోదీ?"

"నా పశుత్వం!"

"నీదా!"

"అవును. నీనించి సరాసరి రమ నా దగ్గరికి వొచ్చింది."

"నీ దగ్గిరికా! నువ్వేం తెలుసు?"

"తరవాత చెపుతా."

"ఈ సంగతంతా రమ నీతో చెప్పుకుందా?"

"లేదు. కాని అట్లాంటి దేదో జరిగిందనుకున్నాను. ఎవరో కాలేజీ కుర్రాడితో ననుకున్నాను. గౌరవనీయుడూ, వయో వృద్ధుడైన లెక్చరర్‌తో ననుకోలేదు. నిన్నామె ఎరుగునని కూడా తెలీలేదు నాకు యీ నాటి వరకు."

"ఎట్లా తెలిసింది నీకు, ఆమె హృదయంలో దెబ్బతిన్నదని?"

"అనుభవం."

"ఏం చేశావు?"

"ఏం చేస్తాడు మొగాడు? నేనా స్థానం ఆక్రమించుకున్నాను."

"పశువా!"

"అన్నానుగా నా 'పశుత్వ' మని?"

"దాంతో ఆమె భవిష్యత్తు మాడ్చేశావా?"

"ఎవరి భవిష్యత్తుని యెవరూ మాడ్చరు. ఆ మాట కొస్తే నీదే యెక్కువ బాధ్యత."

"ఈ వ్యవహారాల్లో యెవరో ఒకరో, లేక ఇద్దరో దెబ్బ తినాలి తప్పదు గావును. నువ్వు తప్పించుకున్నావు. ఆమె నాశనమయింది."

"ఎంత ఉన్నతంగా బిట్టర్‌గా మాట్లాడుతున్నా ఈ ఐడియల్ప్లితో వొచ్చిన ప్రారబ్ధమే అది. ఏ హార్డ్ ఫాక్ట్స్ మాట్లాడినా సరే వాస్తవాన్ని భరించే మనోశక్తిలేక, వెంటనే అసలు యెక్కడా లేని ఏవో జెనరలైజేషన్స్‌లోకి వెళ్ళి, ప్రపంచమే ఆ సూత్రాదలమీద నడుస్తోందని, మాయ కప్పుకుంటారు. ఎవరు జీవితంలో గాయపడేది? గాయపడటానికి సిద్ధంగా, గాయపడే మనసుల్ని పోషించుకున్న వాళ్ళు, జాగ్రత్తపడని లేత యువకులూ, యువతులూ, నే నేమీ కష్టపడలేదు."

"అవును, మొగాడివి నీకేం!"

"మరి మొగాడికి నీ కేమయింది?"

"నాకో అంతరాత్మ వుంది."

"అంతరాత్మ అని గర్వంగా చెప్పుకోకు, అంతరాత్మ అంటే అర్థం ఏదో ఒక వంక

పెట్టుకుని ఏడ్చి, ఆ ఏడుపుని చూసుకుని తక్కినవారికన్న అధికులమనీ, నీతిపరులమనీ, నిబ్బరపడడం."

"నష్టపడ్డ వాళ్ళందరూ అంతరాత్మల వల్లనేనా నష్టపడేది?"

"దానికి బుద్ధి తక్కువతనం తోడ్పడిందంటే పూర్తిగా అణగారి పోతారు. మా వూళ్ళో ఓ డాక్టరు వున్నాడు. యువకుడు, సమర్థుడు, చాలా మంచి ప్రాక్టీసు అందుకుంది అర్నెల్లలో. ఓ ప్లీడరు భార్యని ట్రీట్‌చేస్తో, ఆమె ఆకర్షణకు తాళలేక లొంగాడు అంతే. పదేళ్ళయింది. ఈ నాటికి మళ్ళీ తలెత్తుకోలేదు. ఎందుకు? అంతరాత్మ. ప్రాక్టీసు పోతుందని భయం. అన్నిటికన్న అజాగ్రత్త - అబద్ధం చాతకాక పోవడం."

"వ్యభిచారానికి మోసం తోడ్పడాలంటావు."

"ఆ పేర్లు వొప్పుకోను. వ్యభిచారం కాదు. దాన్నే ఉజ్జ్వలమైన ప్రేమ అని చలంమల్లే అంటే కవులూ, కాకులూ కూడా క్షమిస్తారు. మోసంకాదు. వుత్త వివేకమను. ఎందుకులే ఈ వాదన! ఈనాడు ఇంక నువ్వు నానించి నేర్చుకునేదీ లేదు నేను నీ నుంచి నేర్చుకునేదీ లేదు."

"అవును" అని నవ్వాడు శ్యామారావు. నవ్వి. "రమ ఏమయింది చెప్పు" అన్నాడు.

"మా యింటికి వొచ్చింది అన్నాను కదూ! ఏమీ మాట్లాడకుండా కూచునేది నీకు మల్లేనే నాకు ఆమె మీద చాలా గొప్ప యిష్టం."

"నాకు మల్లేనే అంటా వేమిటి."

"విశాలాక్షి కూతురు గనుక."

"ఐతే నీ కెందుకు మధ్య?"

ఆపుకోలేక నవ్వాడు రాజయ్య, రెండు నిమిషాలసేపు. శ్యామారావు ఆశ్చర్యంతో చూస్తున్నాడు. ఆ రాత్రి వాళ్ళిద్దరూ జీవితపు చివరికి జరిగిన వృద్ధులు కారు. మళ్ళీ గడిచిన కాలాన్ని జీవిస్తూన్న యువకులైనారు.

"ఇందాకణ్ణించి ఏం మాట్లాడావు? మాటలకీ, తాము నిజంగా నమ్ముతున్నాననుకున్న అభిప్రాయాలకీ, మనసులోని అసలు విలువలకీ ఎంతెంత వ్యత్యాసాలు! నీకేనా విశాలాక్షి మీద ప్రేమ? నాకు వుండకూడదా? ఎందుకూ? ఆమెతో నువ్వు చాలాసారట్లు మాట్లాడావు, పద్యాలు రాశావు, ఆమెని జ్ఞాపకముంచుకున్నా ననుకున్నావు. ఆమెవల్ల జీవితం పాడయిందనుకుని తృప్తిపడ్డావు. అన్నిటికన్నా ఆ చివరివిషయం వల్ల ఆమె నీ స్వంతమయింది. ఆమె భర్త కన్న, పిల్లలకన్న, ప్రియులకన్న, నీకే సన్నిహితురాలు ఆమె."

"ప్రియులేమిటి?"

"ఏం? ప్రియులు వుండరా? వుండకూడదా?"

"తెలీందే యెందుకా అపనింద ఆ పవిత్ర....."

"ప్రియులున్నారంటే అపనిందా? యెట్లా మాట్లాడాలోయ్ నీతో! ఆమె ప్రియుడు కావడానికి నీకు అభ్యంతరం లేదుగాని, ఆమెకి ప్రియులున్నారంటే స్త్రీ గౌరవానికే లోపమా? అంత ఆకర్షణ గల స్త్రీ ప్రియులు లేకండానే అట్లాంటి భర్తతో కాపరం చేసిందనడం కన్న ఆమెకి ఇంకేం అపరిదిష్ట కావాలి?"

"అట్లాంటి భర్తేమిటి? నువ్వెరుగుదువా యేమిటి!"

"ఎరగకేం?"

"ఎట్లా?"

"నువ్వు చెప్పనిస్తేనా?"

"చెప్పు."

"అసలు...."

"రమ సంగతి కానేలేదు. అది చెప్పు ముందు."

"అవును. రమ మీద నా కిష్టమన్నాను కాదూ? ముందు ఆమెని చదువు ముగించమని గట్టిగా సలహా యిచ్చాను."

"ఆమెకి ఇల్లూ, తల్లీ, తండ్రీ యేమైనారు? మధ్య నీ సలహా ఎందుకు?"

"ఉన్నారు. కాని తల్లి చిక్కుల్లో ఉంది. నేను రమా గార్డియన్. తండ్రి చచ్చిపోయినాడు. తల్లితోవిరోధం పెట్టుకుంది కూడాను."

"ఎందుకూ?"

"తల్లి మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని చూస్తోందనీ, అంతకు ముందున ఆమె నీతి ప్రవర్తన తనకి తల వొంపులుగా వుందనీ."

"ఎందుకు?"

"అది వేరే కథ, ఇది విను."

"ఇట్లాంటి వాళ్ళ కోసమా, వాళ్ళ శీలాన్ని రక్షించాలనా, నా జీవితాన్ని ధ్వంసం చేసుకుంది నేను!"

"తరువాత పశ్చాత్తాప పడుదుగాని, పశ్చాత్తాపానికి చాలా యేళ్ళున్నాయి. పైగా నీబోటి వాళ్ళకి కాలం అనంతం, పశ్చాత్తాపానికి. ముందు విను. ఈ కథా పాఠం వొచ్చే జన్మకి ఉపయోగపడుతుంది..... రమ తన కింకేం చదువు వొద్దంది. కాని బలవంతం చేసి వొప్పించాను. ఇంకా నెల రోజులుంది కాలేజీ తెరవడానికి. ఆరోజు దగ్గరికి వొచ్చినకొద్దీ

రమ దిగులు ఎక్కువయింది. ఎందుకని అడిగితే కాలేజీలో తక్కిన ఆడపిల్లల్ని భరించలే నంటుంది. వాళ్ళ సంగతి నీ కెందుకు? అంటే, వాళ్ళు తన వెంటపడి తమ సంగతులు చెప్పుకుని తన అభిప్రాయాల్ని అడుగుతారట. ఎన్నాళ్ళు తను అబద్ధాలు చెప్పగలదు? తప్పి జారి యెన్నడన్నా నిజం మాట్లాడగానే, అందరూ విరోధులై తనని ఏడిపించడం, తన వెనక గుసగుసలూ నవ్వులూ ప్రారంభిస్తారు. ఇంక వాళ్ళ ద్వేషాలు, తమ ఇంటి సంగతులు గొప్ప చేసుకోడం, తమ అందాల్ని చూసుకోడం, ప్రతివారూ తమ ఆకర్షణలో పడుతున్నా రనుకోడం-చాలా దుర్భరంట. అదంతా పోనీ. అసలు సంగతి విను.

జ్యేష్ఠ పౌర్ణమి రాత్రి అది. సాయంత్ర మల్లా వర్షం కురిసింది. నేను నా ఆఫీసు గదిలో నిద్రపోవడమే అలవాటు. పడక గదిలో నా భార్యగారితో ఆ పందిరి పట్టెమంచం మీద పడుకోడానికి యెన్నడో తిరగబడ్డాను. ఆ రాత్రి వరండాలో యెవరో తిరుగుతున్నా రనిపించింది. నా రెండో గుమాస్తా మీద నాకు అనుమానం. నిద్ర కొంచెం మెళకువ వచ్చిం తరవాత చప్పున తలుపు తెరిచి బైటకు చూశాను. ఎవరూ కనపడలేదు. అర్ధరాత్రి దాటి వుంటుంది. నిండు చంద్రుడు నడినెత్తిన, వాన కడిగిన ఆకాశంలో తెల్లని మబ్బుల మధ్య వూగుతున్నాడు. అట్లాంటప్పుడు చంద్రుడు యెంతో వొంటరిగా కనపడి, ఏదో జాలి పుడుతంది.

మా వరండా కింద చిన్న తోట దాంటోంచి గోరింట పువ్వులు విజృంభించి గాలినంతా పరిమళంతో నింపుతున్నాయి. వాన నీళ్ళు గుంటలుగా మొక్కలకింద నిలిచి, వాటిల్లో వెన్నెల నీడలతో ఆడుకుంటోంది. చెట్లు కదిలినప్పుడల్లా. ఎండాకాలం తరువాత వానలు వెలిసిన రాత్రుల్ని తలుచుకో. పట్టణాల్లో ఈ ఉద్యోగాలు వొదిలి, యే పల్లెటూరికో వెళ్ళి శాంతంగా ఆ అందం అనుభవించాలని గుండెని పీకే రాత్రులు ఎవరో ఈ భూమికి ప్రియురాలి కంటిలో ఆ వెన్నెల మెరుగులు చూడాలని కలలుకనే రాత్రులు. కాని కలుగుతుందా? యే అదృష్టమైనా కలలతోనే! పల్లెటూరికి వెళ్ళగలిగాడా, ప్లీడరీ వృత్తి వొదిలి, అన్ని అందాల కలలు మనకిచ్చిన సుబ్బారావుగారూ?

చూస్తో నుంచున్నాను స్తంభాన్నానుకుని. చీకట్లో స్తంభానికి అటు పక్క రమ నుంచుని ఉంది. నన్ను తెలుసుకున్నట్టన్నా లేదు. చూస్తోంది తనూ ఆకాశంలోకి. వెనుకగా వెళ్ళి భుజాలమీద చేతులు వేశాను. కదలలేదు. ఆమె వీపుని నా పొట్టకి ఆనించుకుని అట్లా నుంచున్నాను. మమ్మల్ని ఇద్దర్నీ చిన్న చలితో పులకరించే గాలి చుట్టేసి; పరిమళాలతో పలకరించాలని చూసింది. కాలం అనేది మనసులోని మాయ అంటారే! అది నిజం. అట్లాంటప్పుడు తెలుస్తుంది. నా చేతుల కింద ఆమె భుజాలు, నా పొట్టకి ఒత్తుకుంటో ఆమె వీపు, ఆ నీడలోని ఆమె జుట్టులో దూరపు వెన్నెల రేఖల నా కళ్ళకింద ఆమె నుంచి అగరునూనె, నార్సిసస్ పౌడరు పరిమళం, ఆమె ఒంటి చమట మత్తుతో కలిసి, అంతే. అంతకన్న నేను యోచించలేదు. ఆమెకీ లేదు ఏ యోచనా అని తరువాత చెప్పింది.

ఆలోచనలే ఆగాయి కాలం లేదు. దాన్ని ఏ రకం ప్రేమ అంటావో నువ్వు మరి. కోయిల కూసింది, తలెత్తాను ఎదురుగా చంద్రుడి పక్కగా శుక్రతార వెలుగుతోంది. అప్పుడు నా చేతుల్ని ఆమె రొమ్ము మీదికి జరిపి-జరపాలని కాదు-ఆలోచించలేదు. చేతుల అలవాటు. నా చేతులతో-లేక నా రేస్-నా వంశం అలవాటో-మనుష్యజాతి అలవాటో-అంతే. రొమ్ము తాకుతున్నాననీ తెలీదు. ఆమెను తిప్పి లేవనెత్తాను నాకేసి, అప్పుడు మేలుకొని నా వంకా, చుట్టూ- చూసింది. ఒక పరుగుతీసి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిందే అనే ఆలోచనైనా లేకుండా అట్లానే నుంచున్నాను. శుక్రుడివంక చూస్తో. అదేనేమో యోగుల ఆనందం'' అని ఆగాడు రాజయ్య.

"తరవాత'' అన్నాడు శ్యామారావు రహస్యంలాగు శబ్దం లేకండా.''

"అంతే. మళ్ళీ పదిహేనురోజులు. ఆ తెల్లారకట్ట కాలేజీకి వెళ్ళిపోతోంది. రాత్రి మూడింటికి బండి అతను వచ్చి లేపాడు. పెట్టెలూ అవీ బండిలో పెట్టారు. నిద్రపోతున్న నాతో చెప్పడానికి వచ్చింది. గదిలో లైటు వేశాను. నా భార్య పెట్టిన షెపానీ చీరె కట్టుకుంది. సాయంత్రం యెవరింటోనో పేరంటంలో పూసిన గంధం మెడలో మాయనేలేదు.

"వెడుతున్నాను'' అని నవ్వింది.

"మంచిది. సుఖంగా వెళ్ళిరా.

"ఊఁ''

"సూరయ్య లేచాడా?''

"బండి దగ్గర ఉన్నాడు.''

బైటికి వొచ్చాము. మళ్ళీ యెదురుగా దేదీప్యమానంగా వెలుగుతో శుక్రుడు ఆ దృశ్యంతో తోట మధ్య తోవలో ఇద్దరమూ ఆగాము. ముందు నడుస్తున్న ఆమె భుజాలమీద చేతులు వేశాను. ఆగింది. మెల్లిగా ఏడుపు తెరలలో కదిలించి ఆ లేత ఒంటి పులకరింపులు, అప్పుడే గాలి కింద సాయంత్రం ప్రారంభించే సరసులోని అలలమల్లే మెల్లిగా నా వేళ్ళని తాకుతున్నాయి.''

"ఎందుకు?''

"నా చేతులు మళ్ళీ ఆమె రొమ్ముమీదికి వెళ్ళాయి. చప్పున వెనక్కి తిరిగింది. నన్ను తప్పించుకుని ఇంటోకి పోవాలినేమో నా కర్థం కాలేదు. గట్టిగా కావలించుకుని, శుక్ర కాంతితో నిండిన ఆమె కళ్ళలోకి చూశాను. కాని తక్కిన నా అవయావాలలోకి యెక్కడెక్కడికి చేరుకోవాలో అక్కడికి నా రక్తాన్ని తోలుతున్నాడు మన్మధుడు. అంత దగ్గిరగా నుంచున్నాము. ఆమెకీ ఆ స్పర్శతో ఏమయిందో! ఇంకా దగ్గిరగా నా రొమ్ము లోపలికి జరిగింది. నేను పక్కకి తిరిగి ఆమెని గది లోపలికి తీసుకుని వెళ్ళాను.

తరవాత యేమేం జరిగిందో రాజయ్య వర్ణించకండా వుండలేదు. అంత చనువైన మిత్రుల మధ్య రహస్య మేముంది.

ఆ బండి అట్లానే నుంచుని వుంది. సూరయ్య అట్లానే చూస్తున్నాడు, అమ్మాయిగారు ఇంకా రారేమో అని, గదిలోంచే రాజయ్య

"సూరయ్యా! రమకి ఒళ్ళు బాగాలేదట సామాను లోపల పెట్టించి, బండి వాణ్ణి రేపు రమ్మను" అన్నదాకా.

"తెల్లారే లోపలే బలవంతం చేసి నన్ను ఒప్పించింది, తనని కాలేజీకి పంపించననీ. నాతోనే వుంచుకుంటాననీ."

"అంత బలవంతం చెయ్యాల్సి వచ్చిందా?" అన్నాడు వొణుకుతున్న అసహజమైన నవ్వుతో శ్యామారావు.

"కాకపోతే, జన్మకి మెళ్ళో కట్టుకోనా ఆ పిల్లని."

"ఆ పిల్ల నిన్ను అంత పెద్దవాణ్ణి కట్టుకోగా లేంది?"

"అదీ నీ యోచన. నిన్ను కట్టుకుంటుందేమో నని కాదు. ఆ పిల్లని అంత పెద్దవాణ్ణి నేను కట్టుకుంటున్నానే అని, పర్యవసానం ఒకటే. ఆలోచనల్లో. కార్యాలలో కాదు. ఒకటే యోచన రెండు చివర్ల నించే చూశాము. ఆ కాస్త భేదమూ, కార్యరూపంలోకి వొచ్చేప్పటికి కొండంతలు భేదం కన్పిస్తుంది. నా వయసెక్కడ? ఆమె వయసెక్కడ? నా కెంత భారం!"

"ఏం భారం?"

"ఖర్చు ఫరవాలేదనుకో. కాలం, కీర్తి, తద్వారా రాబడి, ఒంటి ఆరోగ్యం-అన్నీ భారమే. ఇవన్నీ యోచించా ననుకున్నావా? లేదు. ఆలోచించకుండానే తన జాగ్రత్తలోనే వుంటుంది మనసు స్వాభావికంగా. చలం కథలో హీరో ననుకున్నావా?"

"మరి యెట్లా ఒప్పుకున్నావు?"

"మూర్ఖుడా! ఆ సమయంలో జమీలు ధారాదత్తాలు చేసిన వారున్నారోయ్....."

"ఏ సమయంలో?"

"ఏ సమయంలోనా? ఈ సమయంలో!" అని చేతులతో చూపించాడు రాజయ్య. "నా దగ్గిర జమీందారీ వ్యాజ్యాలలో మూడోఒంతు అట్లాంటి సమయాలలో వాళ్ళు స్త్రీలకి చేసిన వాగ్దానాలు చెల్లవని వాళ్ళు తగాదా పెట్టినవే." "నువ్వూ అంతేనా?"

"భేదం వుంది. తెల్లారిన తరవాత లేదు పొమ్మనరు ఆ వెలమదొరలు. దర్జాకి లోపమనో, లేక నిజానికి నిలబడాలనేది పూర్వకాలంనించి రక్తంలో వొస్తూందో, లేక వుత్త బుద్ధిలేని తనమో!"

"మరి ఇక వాజ్యా లెందుకు?"

"ఆ వాగ్దాత్తాలు చేసే నిమషాల అసలు తమకి ఆస్తి యెంతవుందో మరిచిపోతున్నారు. పక్కవాళ్ళ జమీలు కూడా రాసి ఇస్తారు, అడిగితే కొన్ని నక్షత్రాల్ని కూడా దానం చేస్తారు."

"సరే. నువ్వేం చేశావు?"

"నే నట్లానా? మర్నాడు రాత్రే రైలెక్కించాను రమని."

"నీచుడా!"

"నీ కన్నానా?"

"కాని నేను ఏమన్నా...."

"సరేలే, తెలుసు. రమని నా దగ్గర అట్టే పెట్టుకోవడం మా ఇద్దరిలో యెవరికన్నా శ్రేయస్కరమా? ఆ రాత్రి జరిగిన పని ధర్మమని అంటావా?"

"అనను."

"వాగ్దానం చేశాను కదా, ఆమెను చేతుల్లో అదుముకుని నోటిలో నోరు పెట్టి అడిగే నిముషంలో అని, ఆ అధర్మాన్ని అట్లా చేస్తోనే వుండమంటావా? అదిగాక ఆమెకి పద్దెనిమిదేళ్ళు లేవు. ఆ ఒక్క పనితో, ఆనాటి రాత్రి పురుషుడు యవ్వనవతికి ఏమవుతాడో తెలుసా? దైవం! అందువల్లనే ఈ సంసారాలు ఇంతవరకన్నా నిలబడడం, ఇట్లా-విచ్ఛిన్నం, కావడంకూడాను. మొదట ఆమెకి ఆ సుఖ మిచ్చిన పురుషుణ్ణి యెన్ని జన్మలకీ మరవలేదు స్త్రీ, గర్భాదామనే పేరుతో లేత పిల్లల గర్భాన్ని చించిపెట్టే దౌర్భాత్యుల్ని తప్ప. అటు తర్వాత యే ప్రియుడో ఆమెకి అసలు సంగతి రుచి చూపినప్పుడు అన్నీ ఒదిలి లేచిపోతుంది, జీవమున్న స్త్రీ-అతను యెవరు కానీ, యెంత అధముడు కానీ. మర్నాడు రమ నా ఆఫీసు బల్ల పక్కన కుర్చీ వేసుకుని ఆరని జుట్టుని నా కాయితాలనిండా వేస్తో, నా కళ్ళకేసి ఆరిధిస్తో చూస్తో కూచుంది. ఆరాధన దేనికి? తనకి పునర్జన్మ నిచ్చానని, కొత్త స్వర్గద్వారాలు తెరిచానని; తన ఒంటికి ఓ సార్థకతను తెలిపానని-తన భూమినే నందన వనంగా పుష్పించ చేశానని. అది నా ప్రత్యేకత అనుకుంది ఆలోచించదు. ఆ ప్రజ్ఞ అంతానా ఒక్కడిదేనని వుత్త accident ఓ దౌర్భాగ్యుడు చేతిలోది జారవిడిస్తే, ఇంకోడు అందుకున్నాడు. వాళ్ళిద్దరూ-మిత్రులు" అని నవ్వాడు రాజయ్య.

"అట్లాంటి పిల్లని నా ఆఫీసు పని చేస్తో నేనేం చేసుకోను?" అన్నాడు మళ్ళీ అతనే.

"ఎందుకు ఆఫీసు పని? డబ్బులేదా?"

"ఆలోచించలేదు నేను, నా (ఇన్ని టింక్ట్) అది. నన్ను రక్షించే కాపుదల. ఇప్పు డేమనుకుంటా నంటే నా ఉద్యోగం, డబ్బు కోసమే కాదు, పురుష లక్షణం. స్త్రీ వల్లగాని, దేనివల్లగానీ పురుషుడు తన ధర్మాన్నీ, తన వృత్తిని మానాడా చాలా దెబ్బ తింటాడని."

"సరేలే. తరవాత?"

"ప్రతి శలవకీ రమతో దేశమంతా అందమైన ప్రదేశాన్నీ తిరిగాను. అలిసి మూతలు పడ్డ మా కళ్ళని హిమాలయ శిఖరాల మీది మంచునించి ప్రతిఫలించే వెలుగు మేల్కొలిపింది. కన్యాకుమారిలో కొండలికి తగిలి విరిగిపడే అలలు మాకు జోలపాడాయి. కాశ్మీరదేశపు కుంకుమ పువ్వు మలబారు జాజికాయ తోటలనించి పరిమళాలు తెచ్చి పడవలో తేలే మా మీద గుమ్మరించింది గాలి. తాజ్‌మహల్లో కూచుని ముంతాజ్ కథను చెప్పుకున్నాము. హంపీలో కిష్కింధ శిఖరాని కెక్కి కాలంలో వెనక్కి చూశాము. ఒకటేమిటి? నై నిటాల్‌లో రాత్రి సరస్సులో దీపాల వెలుగులు రమ కళ్ళల్లో చూశాను'. ఊటీలో పైనించి చూస్తో, కింది రంగుల మబ్బుల్లో వూగాము. ఏం కాల మది! అట్లాంటి అనుభవా లివ్వడానికే డబ్బు ఉపయోగం."

"ఏం, తక్కినవీ?"

"తక్కిన వేమిట్లే! ఆస్తులూ, గొప్పలూ, మన సొంతానికేం ఒరిగింది?"

"అవే మిగిలేవి. ఈ అనుభవం అంతటితో ఆఖరూ."

"ఆస్తుల్ని పట్టుకుపోతామా?"

"అనుభవాల్ని పట్టుకుపోతామా?"

"జ్ఞాపకాలు జీవితంలో మాధుర్యం తాగామనే తృప్తి. చచ్చిం తరవాత మిగిలేదే అది. అంత గొప్ప అనుభవం తరవాత చావంటే దిగులు వుండదు. జీవితం ఇంతకన్న ఏముంది అనిపిస్తుంది."

"కాని నిజమైన గొప్ప అనుభవానికి ధనం అంత అవసరమా?"

"తప్పకండా. అట్లాంటి అనుభవానికి, ఆనందానికి మెరుగుపెడు తుంది ధనం ఒకే మోహ వ్యాపారం, మామూలు గదుల్లోనూ, సముద్ర తీరంలోనూ జరగడంలో వ్యత్యాసముంది. కొత్త స్థలం, పరిమళాలు, సంగీతం, ప్రకృతిరామణీయకత అన్నీ చాలా తోడ్పడతాయి. వాటన్నిటికీ ధనం కావాలి."

"కాని గొప్ప అనుభవమే ఐతే, చిత్తంఏకాగ్రమై ఇంకేమీ చూడలేమేమో?"

"అవును కాని అనుభవానికి ముందూ తరవాతా అనేవి ఉన్నాయిగా. ధనం అందరికీ పంచుతా మంటారా? ఇప్పుడు కొంతమందికన్నా చాలా అందమైన జీవిత భాగాలున్నాయి. అప్పుడెవరికీ వుండవు!"

"మరి కొందరికి కటిక దరిద్రం....."

"అవన్నీ తెలుసులే. ఏమిటో వూరికే తిని కని బతకడం ఎందుకు? అంతకన్న దరిద్రమే మేలు."

"దరిద్రమంటే యెరగవు గనక-నా చిన్నతనంలో....."

"నేనూ చిన్నప్పు డెరుగుదు ననుకో. నువ్వనేదంతా నిజమే. కాని అందంలేని జీవిత మేమిటి పోదూ!"

"అందానికీ, ధనానికీ అంత సంబంధం తప్పకుండా వుందా అని?"

"బోలెడు. కాకపోతే ఆ ధనం కోసం ఇన్ని తగాదాలెందుకు? ధనం అక్కర్లేని యోగులున్నారు. తక్కిన వాళ్ళందరికీ అదీ అవసరమే."

"గాంధీగారికీ?"

"ఆ. తనకి అక్కరలేదు ధనం, కాని తన ప్రజల దరిద్రం పోగొట్టడానికేగా ఆ తాపత్రయం?"

"కాని తనకి స్వంతానికి ధనం అవసరం లేదుగా?"

"అంటే ధనం వల్ల వచ్చే సుఖాలుకూడా అవసరం లేదన్నమాట."

"అవును. అదే నేననేది. ఆయనకి ఎందుకు ఆ సుఖాలు అక్కర్లేదు. ధనంతో పనిలేని ఆనందాలున్నాయి గనక."

"అట్లా అనకు, అట్లా ఐతే ముళ్ళకంపమీద పడుకునే బైరాగీ, వీపు రక్తం కారేట్టు పగలకొట్టుకునే బిచ్చగాడూ, ఆ బాధలో మనం ఎరగని ఆనందాన్ని అనుభవిస్తున్నా రంటావా? వేరే అవసరాల కోసం ఎన్ని బాధల్ని కిక్కురు మనకండా అనుభవించగల డనుకున్నావు మనిషి! రాత్రిం బగళ్ళు clients తో కిందా మీదా పడడం ఓ సుఖమా ? అదిగాక ఎట్లా ఏ లోక సంస్కారంలోనో మునిగిన మనిషికి ఆనందం అనుభవించగల ఆసక్తే పోతుంది. చల్లగాలిని చూసినా భయమై పోతుంది. ఆ లోకంలో ఏదో జరుగుతుందనే కాంక్ష, తమ ధర్మమనే మత్తు, సామాన్య ప్రజలనించి ప్రత్యేకతనూ అధిక్యాన్నీ తాము feel అవాలనే అహంభావం, వైర్యాగపు కీర్తి, తమ మనసులోనే గొప్ప త్యాగమూర్తి అనే పలుకుబడి.....ఎన్నని!"

"సినిక్."

"సినిక్ ఎవరో తెలుసునా? మన కలలకీ, అబద్ధపు నమ్మకాలకీ గాయం అయ్యేట్టు నిజం మాట్టాడేవాడు."

"అదే నిజమని ఏమిటి?"

"ఏమైతేనేం? ధనంతో పని లేకండా బతుకుతున్నాము, సుఖపడ గలము అనే వాళ్ళు గతిలేకనో, గొప్పకోసమో వాంఛల్ని ఆరికట్టుకున్నారనుకో. కాని చాలామందికి మామూలు మృగ వాంఛలకన్న ఎక్కువ వుండనే వుండవు. వాళ్ళకి ఎక్కువ ధనంతో

పనిలేదు. ఇప్పుడు డబ్బు సంపాదించే వాళ్ళల్లో కూడా, ఆ డబ్బునించి ఆనందం పొందడం ఎంత మందికి తెలుసునంటావు? అసలు డబ్బు పంపకం వేరే విధంగా వుండాలి. ఎవరి ఆవసరాల్ని పట్టి వారికి ఎంత ధనం కావాలో నిర్ణయించాలి. కమ్యూనిజంలో సంఖ్యనిపట్టి పంచుతారు. అట్టాకాదు, అవసరాన్ని పట్టి తక్కువ తినేవాడికీ, ఎక్కువ తినేవాడికి రేషన్‌లో ఒకటే కొలత బియ్యం ఇవ్వడం యెంత బుద్ధితక్కువో, సరిగా అర్థయుతంగా ఖర్చుచేసుకోడం తెలీని వాడికి ధనం ఇవ్వడమూ అంతే అవివేకం. ధనమే కాదు, ధనమిచ్చే అనుభవం కూడా. గొప్ప రచనా, గొప్ప సంగీతమూ తప్పనిసరిగా వినిపిస్తే, రసికతలేని రాజు నిద్రపోతాడు. పూనా, బాంబేల మధ్య ఫస్టుక్లాసులో ఒంటరిగా రమని ఆనుకుని కిటికీలోంచి చూస్తో కూచోడం ఒక గొప్ప అనుభవం. కాని లక్షధికార్లూ, బిచ్చగాళ్లూ కూడా కునికిపాట్లు పడుతోనే, పేపరు చదువుకుంటోనో కూచుంటారు. మామూలుగా తిరిగేవాళ్ళే కాదు. మొదటిసారి కొత్తగా చూస్తున్న వాళ్ళు కూడా. లోనవ్లా స్టేషన్‌లో ఓసారి, (వఞఎఋతీంఱశీఅ) ఎక్స్‌ర్షన్ వచ్చిన కాలేజీ విద్యార్థులు కాఫీ కోసం తొక్కుకుంటో, అటూ ఇటూ కళ్ళెత్తిన పాపాన పోలేదు.

"సరేలే కానీ, అట్లానే పంపకం పెట్టిద్దాము. నీ కథకానీ."

"అవును. మూడేళ్ళు తిరిగాము. రమకి మాత్రం చదువు రానేలేదు. ఎట్లాగో ఇన్టర్ దాటింది. కడుపు వొచ్చింది. రెండో నెలలో నాతో చెప్పింది. వెంటనే యేమీ ఆలస్యం కాకండా యెవరో ఒకర్ని పెళ్ళి చేసుకోమన్నాను."

"ఆఁ, ఆఁ, ఆఁ," అరిచాడు శ్యామారావు ఆశ్చర్యంతో, అసహ్యంతో, ఆ మాటలు తన చెవులు నమ్మలేనట్టు. అది మూలుగులాగ వినపడ్డది రాజయ్యకి.

"ఏమిటది? యేమన్నా నెప్పా."

"ఆ! చాలా నెప్పి! పెళ్ళి చేసుకోమన్నావా? ఎట్లా అన్నావు ఆ మాట?"

"యేమి?"

"సరేలే. రమ యేమంది?"

"ఒప్పుకోలేదు."

"ఒప్పుకుంటుందని కూడా అనుకున్నావా యేమిటీ? చాలా గొప్ప వాతడివి. ఆ పిల్ల మనిషా, కొయ్యబొమ్మా?"

"అంతకన్న యేం చేస్తుంది?"

"అదేలే. ఎందుకు చేసుకోనంది?"

"ఏమో! అనడం నామీది ఇష్టం వల్లనంది 'ఇష్టానికే ఇష్టం వుండనీ పెళ్ళి కాక యేం చేదామని?" అని బలవంతం చేశాను.

"రాస్కెల్!"

"ఆగు. ఆగు. మాటలనడం సులభమే. ఆ పరిస్థితిలో నువ్వేం చేసేవాడివి ?"

"అసలు ఆ పరిస్థితి రానీను."

"ఎట్లా ? అసలు ఆ సంబంధం నించి చల్లగా తప్పుకుంటానంటావు దొంగమల్లే. సరే. అంతరకూ ఏ పొరపాటునో దిగావనుకో."

"నేనే భరిస్తాను."

"పెళ్ళి చేసుకునా?"

"అదన్నా సరే."

"ఇద్దరు పెళ్ళాల్ని ఓ యింటో పెట్టి! నీకేం గవర్నమెంటు నౌకరివి. తెల్లవారితే నా బతుకు నలుగురి జేబుల మీదా ఆధారపడ్డదోయ్. ఎంత జాగ్రత్తపడ్డాను! మరి రమని కాలేజీకి పంపడం, శలవలో ఇద్దరం విడివిడిగా ప్రయాణం చేసి యెక్కడో కలుసుకోడం, అంతదూరంలో తెలుగు మొహం కనపడితే ఆ చోటినుంచి పలాయనం కావడం-యెవరికీ తెలీదనుకో. మరి పెళ్ళి చేసుకోనా? ఆనాడు చేసుకోవచ్చుననుకో, బుద్ధిగల బ్రిటిష్ ప్రభుత్వం తప్పుడు బిల్లులు అల్లకండా మన కాళేశ్వర్రావుని జైలులోనే వుంచింది అప్పుడు. కాని నా కూతురు యీడు వున్న ఆ పిల్లని...."

"పోనీ పెళ్ళి లేకండానే....."

"వూరికే నాన్సెన్సు మాట్టాడకు. ఆ పిల్ల భవిష్యత్తు...."

"యేమన్నా అను యేం చేసినా, ఎన్ని కష్టాలుపడ్డా, నాశనమై పోయినా, ఆ పిల్లని ఇంకోడికి అంటకట్ట చూడటం-ఆ పిల్లకి, ఆ వరుడికి చాలా అన్యాయం."

"అన్యాయం-అనడంతో సరిపోతుందనుకున్నావా? ~~ఈ~~ idealiste (ఐడియలిస్ట్) అట్లానే తమ జీవితాల్ని ధ్వంసం చేసుకుని, ఇతర జీవితాల్ని నాశనం చేసేది. నాశనమైనా సరేట. నాశనమయ్యే పని ఎందుకు చెయ్యాలి? తప్పించుకునే మార్గం వుంటే?"

"నీ ఆనర్?"

"నా కట్టాంటి బుద్ధి తక్కువ ఆనర్ లేదు. అన్నీ కొన్ని మాటలు ఏర్పడ్డాయోయ్. వాటికి అర్థంగాని, ముక్కూ మొహంగాని యోచించరు. కాలంతో అవి మారతాయనీ, వాటి అర్థమేమారుతుందనీ తెలుసుకోరు. వాటినే పట్టుకుని వేళ్ళాడతారు. వేళ్ళాడి గోతుల్లో పడండి. కాని అవే గొప్ప అని, వాటితో ఇతరుల కార్యాల్నీ, జీవితాల్నీ కొలవకండి. మీరే గొప్ప అని మీమనసుల్లో కులక్కండి. ఆ మాటల్లో యెంతస్వార్థం వుందో, ఇబ్బందిలోంచి తప్పించుకోడానికి అవి ఎంత వీలైన దొంగ మార్గాలో మరచిపోతారు. Practical

(ప్రాక్టికల్‌గా) యోచించడంనించి, కార్యదక్షత నించి, ఇతరులకి ఉపయోపడే అవసరం నించి, సులభంగా తప్పిస్తాయి ఈ నీతీ, ధర్మం ఆనర్, దేవుడూ ఇట్లాంటివి. మీ కంటే ఓ పాఠం యెక్కువ నేర్చుకున్న వాళ్ళున్నారు. వేదాంతులు. లోకమే మాయ! అని ఎవరికీ ఏ మాత్రం సహాయపడకుండా, అసలు ఆ యోచనే చాలా భారామై మనసుల్ని కట్టేసుకుని తమ గూళ్ళల్లో నవరంధ్రలూ మూసుక్కూచుంటారు. ఎవరూ చూడకుండా, వీలైనప్పుడల్లా, లటుక్కున ఏ ధనాన్నో, యే ఆడదాన్నో వేసుకుని, చప్పున మళ్ళీ గుంటలో దూరతారు. ప్రశ్నగాని, బాధ్యతగాని వొచ్చిందా అసలు పలకరు, వాదించరు- అంతా మాయ, అహం బ్రహ్మాసి అంటారు.

"కాకపోతే లోకం నిజమంటావా ?"

"మాయా? మాయ ఐతే, ఆ మాయ అనే వాడెవడు, వినేవాడెవడు ?"

"సర్వం ఏకం."

"నిజంగానే ఇదంతా మనకి యేకంగా కనపడ్డప్పుడు యేకం అందాం. ప్రస్తుతం భిన్నమేగా-ఆ తప్పుడు మాట లెందుకు? చౌర్యానికి, వేరే దేన్నించో తప్పించుకోడానికి. ముఖ్యంగా తమనించి. వాళ్ళల్లో సిన్‌సియర్ మనుషుల లేకపోలేదు, నీ బోటి వాళ్ళు. వాళు ళనుకునే నీతి, ఆనర్ పద్ధతులుకి ఈ ప్రపంచం విరుద్ధం, భరించలేక కళ్ళు మూసుకుంటారు, మాయ అని. ప్రేమ భగ్నమైన మనిషి స్త్రీని తిట్టి ప్రేమ అనేది వుత్తకవిత్వ మనడూ-అట్లాగే."

"చివరికి ఏంచేశావు?"

"పెళ్ళి చేశాను, భాస్కరరావు కిచ్చి. నువ్వు చూశానన్నావుగా అతన్ని."

"అతని మొహం ఎట్లా చూడగలిగావో! నీ ఉంపుడు కత్తెని అతనికి అంటకట్టావు. పైగా నీ పిల్లని అతని పిల్లగా. అతను మోసపోయి యావజ్జీవనమూ పోషించేట్టు చేస్తున్నావు. ఆ మోసాన్ని యెట్లా భరించావో !"

"నీ మాటలెట్లా వున్నాయంటే-ఈ భూత దయగాళ్ళు - నిలువునా కోడిప్రాణం ఎట్లా తీశావు అంటారు, ఆశ్చర్యంగా. వాళ్ళ కళ్ళ యెదటే ప్రతి నిమిషం లెక్కలేని ప్రాణులు చస్తూవుంటే, ఒకదాన్ని ఒకటి మింగుతో వుంటే."

"వున్నారులే ఘాతకులూ. మోసగాళ్ళూ, నువ్వూ అంతేనా అని....."

"పెద్దపులిని చంపడమూ ఘాతుకమేనా? ఆ మోసం చెయ్యకపోతే కలిగే ఘోరాల్ని తలుచుకో."

"సరేలే. ఈ గొడవలో ఆ తల్లి యేం చేస్తోంది?"

"ఆ కథ తరవాత చెపుతా. రమకి పెళ్ళి చేసేశాను ఆ భాస్కరరావుకిచ్చి నువ్వు చూశావుగా!"

"ఎట్లా దొరికాడు అంత సులభగా?"

"నాతో తిరిగేప్పుడు రమ నా కూతురు. అందుకని యువకులు కొంత వెంటపడేవారు. రైల్లో తటస్థపడ్డాడు ఈ భాస్కరరావు. అతనూ అజంతాకి వొచ్చాడు. మేమక్కడ వుండగా రమ వెంట పడ్డాడు పెళ్ళి చేసుకోమని. నవ్వేసి అతని నించి తప్పించుకున్నాము. తమ కాలేజి ఎడ్రసు తెలుసుకుని, ఆమెకి ప్రేమలేఖలే గాక, ఆమెని చూడ్డానికి కూడా వెళ్ళేవాడు. కాని లాభంలేదని చెప్పేసింది రమ. ధనవంతుడు, భార్యని వొదిలేశాడు, కనక రమనిచ్చి పెళ్ళి చేశాము."

"వ్యభిచారం చేయించావన్నమాట."

"అర్థంలేని మాట మానెయ్యి. 'స్త్రీ' అనే పుస్తకం చదువు. కొంచెం మాటలకి అర్థాలు తెలుస్తాయి."

"పోనీలే రమకి నీమీద కదా యిష్టం?"

"అవును. నేనేం మారానా? మరీ నిలవలేనప్పుడు నా దగ్గిరికి వొస్తోనే వుండేది."

"పెళ్ళి ఐనాక కూడానా?"

"ఊఁ"

"ఏమిటి! రానిచ్చేవాడా?"

"నేను గార్డియన్ని కదూ!" అని నవ్వాడు రాజయ్య.

"ఘోరం. ఇంక మాట్లాడకు భరించలేను" అని శ్యామారావు లేచిపోయి కిటికి దగ్గిర నుంచున్నాడు. రాజయ్య నవ్వుతున్నాడు.

"ఈ సంగతులు తెలిస్తే నువ్వు నన్ను నీ యింటికి రానిచ్చేవాడివే కాదనుకుంటాను. ఇంక నా పిల్లనేం చేసుకుంటావు నీ కొడుక్కి.....కాని ఇది తెలుసుకో. ఎక్కడో నీవంటి వెర్రివాళ్ళు తప్ప, అందరూ ఇట్లాంటి పనులు సమయం వొస్తే చేసేవారే. అక్కడే ఈ కర్మ వేదాంతంతో, పుణ్యాపాపాలతో నా తగాదా. కొందరికి పాప కార్యాలు చేసే అవసరం కలుగుతుంది. కొందరికి కలగదు. అవసరంవల్ల చేసినవాళ్ళు పాపాత్ములు, ఆ అవసరం లేక చెయ్యనివాళ్ళు పుణ్యాత్ములూనా? భయంవల్ల మానేసే భీరులు అంతకన్నా పవిత్రులు. ఇంక పోలీసు వాళ్ళ కన్న ఏం గొప్ప ఆ దేవుడు?"

"అదంతా పోనీ, ఆ పిల్ల యెటువంటిదో మధ్య మధ్య నీ దగ్గిరికి రావడానికి?"

"ఎటువంటిదీ కాదు. చాలామంది కుటుంబ స్త్రీలకన్న ఉత్తమరాలు. ఆ పిల్లకి వీలు చిక్కింది. అంతే."

"నేను నమ్మను. వంశంలోనే ఉంటుంది ఆ గుణం. విశాలాక్షికి తెలుసా ఇదంతా? ఏమయింది అన్నేళ్ళూ కూతుర్ని నీకు వప్పచెప్పి."

"చెపుతా ఆ కథ. విశాలాక్షి ఏమీ దుర్మార్గురాలు కాదని నీకు తెలుసు. కూతురు కథ విని అమాంతం నువ్వు ప్రేమించిన పిల్లని నరకంలోకి తోసేశావు. లోకం యెంత మారిపోతోందో! మారడమంటే, ఇది వరకు రహస్యంగా జరిగేవి. ఇప్పుడు ధైర్యంగా బహిరంగంగా జరుగుతున్నాయి అదే మార్పు. నీవంటి వాళ్ళ మనసులు మాత్రం ఇంకా చీకట్లో కళ్ళు మూసుకుని 'యేంలేదు' అని పాతకలలు కంటున్నాయి. ఈ లోకమంతా నరకానికి పోతే మనమూ పోదాంలే. మనం మాత్రం స్వర్గానికి పోయి యేం చేస్తాం అక్కడ, యేం తోచకండా?"

"సరేలే. చివరి కేమయింది?"

"ఏం కాలేదు. కథ అనుకున్నావా యేమిటి, అతనికి నిజం తెలీడం, రమని ఒదిలెయ్యడమూ అదీ? అదంతా కథల్లో. నెలలు నిండకుండా పిల్ల పుట్టిందన్నారు. ఆ పిల్లా హాయిగా వుంది. నువ్వు చూశావు కదూ? అది నాకూతురు. తరవాత పిల్లలు లేరు."

"ఆ పిల్ల అచ్చం విశాలాక్షి మల్లే ఉంది అనుకున్నాను, మా ఇంటికి వచ్చినప్పుడు."

"అవును."

"తరవాత?"

"అతనికి గ్రీక్ భాష వొచ్చుట. అందుకని గ్రీసు దేశానికి మర రాయబారిగా వెళ్ళాడు."

"నవ్వులాటా?"

"కాదు ఇంకా ఆ రోజుల్లో అనేవాళ్ళం penguin బొమ్మలు గీశాడని, Antarctic continet రాయబారిగా వెళ్ళాడని. కాని వెళ్ళింది నిజం భార్యతో, పదేళ్ళ కూతురుతో వెళ్ళాడు."

"అంతేనా?"

"అంతే."

"విశాలాక్షి?"

"చచ్చిపోయింది కదూ! నాలుగేళ్ళయింది."

"నీ కెట్లా తెలుసు విశాలాక్షి-కాలేజీ రోజుల తరవాత ? ఆ సంగతి చెప్పు. అన్నట్టు చెప్పావుగా, నీకూ ఆమె మీద ప్రేమ అని. ఒక్కసారీ చూచాయగానన్నా తెలియ నిచ్చావు కావు"

"ప్రేమ అన్నానా? అవునులే కానీ నీతో చెప్పడ మెందుకు ? అదో అవస్థ నీకు ! చెపితే ఏం చేసేవాడివి ? నేను చెప్పాను కదూ, అనవసరంగా బతుకు బయలు చేసుకునే రకం మనిషిని కానని !"

"ప్రేమ ఫలితం కూతురులో అనుభవించావులే. కాని విశాలాక్షి అందం ఎక్కడ ! రమకి ఎక్కడ వుంది ఆ అందం?"

"అందమే ప్రధాన మనుకోకు. రమ రతి చాతుర్యం (ఆ మాట అనలేదు రాజయ్య, రాయడానికి వీలులేని బూతు మాట అన్నాడు) విశాలాక్షికి ఏం చేతనౌను ?"

"అదేమిటి? విశాలాక్షి రహస్యాలు నీకేం తెలుసు?"

రాజయ్య మాట్లాడలేదు.

"ఏం మాట్లాడవు?"

"మా అత్తవారి వూరూ, విశాలాక్షి అత్తవారి వూరూ ఒకటే."

"ఓహెూ! చాలా ప్రబుద్ధుడివోయ్. ఇళ్ళు కూడా పక్క పక్కనేనా?"

"కాదు."

"ఆమే భర్త అసమర్ధుడా ? అనామకుడా ?"

"ఏమికాదు, నాకు చాలా మిత్రుడు."

"ఓహెూ ! ఆ మోసం కూడానా ? చూడ్డానికి ఇట్లా వున్నావుగాని, చాలా వ్యవహార కర్తవి."

"అట్లాంటి దేమీ కాదు. నన్ను మరీ ద్రోహి కింద జమ కట్టకు. అతని మీద నాకు చాలా గౌరవం-అదే విశాలాక్షి భర్త చక్రపాణి మీద. అతని మీద విశాలాక్షికి గొప్ప ప్రేమా, గౌరవం. అతను చచ్చిపోయినాడు రమకి పధ్నాలుగేళ్ళప్పుడు."

"అప్పుడు తమరు వోదార్చారా?"

"అప్పుడు ఆకుటుంబ వ్యవహారాలు నేనుచూడాల్సి వొచ్చింది. అందువల్ల రమ నన్ను తన గార్డియన్ కింద...."

"తండ్రి కింద అను నీకేం జంకు, నిండా మునిగిన వాడికి!"

"వుండవోయ్ ? భర్త ఆస్తి అంతా చిక్కుల్లో పడ్డది. అవన్నీ విడతీసేప్పటికి యేమీ మిగిలేట్లు లేదు. ఆ విచారంతో విశాలాక్షికి దైవ భక్తి ముంచుకొచ్చింది. అదేదో ఆశ్రమం తిరుపతి దగ్గర, అక్కడికి పోయింది."

"ఎప్పుడు ?"

"భర్త పోయిన మూడేళ్ళకి, రమ నీ కాలేజీలో ప్రవేశిస్తుందనగా, నువ్వక్కడ వున్నావని తెలీదు. తెలిస్తే నేను స్వయంగా రమని నీకు వప్పగించేవాడిని."

"ఆ మూడేళ్ళలో నువ్వేం చేశావు? నీ మూలానే నేమో విశాలాక్షి ఆ ఆశ్రమానికి వెళ్ళింది."

రాజయ్య బిగ్గరగా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావ్?"

"మీ నీతిపరుల కున్నంత nasty minds (నాస్టీ మైండ్స్) మురికి మనస్సులెవరికీ వుండ వనుకుంటాను. అదే గోల కదా! అదంతా ప్రాముఖ్యమా? అంతకన్న ముఖ్యమైన సంగతులు లేవా? ఓ మొగాడూ ఆడదీ పడుకోడమనేది అంత అసాధారణమూ ఘోరమూ యెందు కవుతుంది మీ మనసులో? నిత్యమూ నీ చుట్టూ సృష్టి అంతా లక్ష విధాల జరుగుతున్న పని. అసలు మీరు ఆ విషయం జోలికి పోరు. కాని అది మీ సమీపంలో యెక్కడన్నా జరిగినట్టు వుందా, ఇంక దాన్ని పని కట్టుకుంటో ముక్కుని ఆ వాసనమీదనే కేంద్రీకరించి వెతుకుతారు. గాటియర్ రాస్తాడులే, ఈ విమర్శకులు కథల్లో బూతు భాగాల దగ్గరికి, పందులు బురద కుళ్ళుని వెతుక్కుంటో పోయినట్టు పోయి కెలుకుతారట. కెలికి బాగా చప్పరించి, మనసు మురికి అయిందనీ, జిడ్డు పట్టిందనీ ఆరుస్తారు, మరి తనివితీరని ఆ ముట్టెలు ఒదిలిరావు ఆ స్థలంనించి ఓ పట్టాన. "ఏం మిగిలింది? ఏం మిగిలింది? అని యింకా వెతుక్కుంటాయి పాపం!"

"సరేలే. ఆ ఉపన్యాసం చాలు. నీ సంగతి చెపుదూ."

"అందువల్ల రమకి నేను గార్డియన్ అయినాను. ఆమె చదువుకి నేనే ఖర్చు చేశాను."

"ధనందానం, గర్భాదానం కూడా చేశావు తల్లికీ, కూతురికీ కూడా. ఎట్లా ఒప్పింది నీ అంతరాత్మ? రమ కూతురు నీదా, ఆ భర్తదా?"

"నాదేనని చెప్పానుగా."

"అచ్చం విశాలాక్షి పోలిక. అంతా ఆ అందం. కాని నీకు అందంతో పనేమిటిలే!"

"వెక్కిరించకు. కథంతా విను. అప్పటికి దాచుకో తిట్లు. ఇంకా యెంత కోప్పడతావో!"

"ఊ" అన్నాడు శామ్యూరావు బాధపడుతో.

"చిన్ననాడు నన్ను విశాలాక్షి ఇంటికి పంపించావు జ్ఞాపకముందా?"

"నా మూలాన నీకు చివాట్లూ ప్రహరణాలూ" అని కసిగా నవ్వాడు శ్యామారావు అది జ్ఞాపకం తెచ్చుకుని అన్నాడు-"ఇన్నాళ్ళూ అది తలచుకున్నప్పుడల్లా నిన్ను గురించి దిగులు పడ్డాను. నా మూలాన అన్యాయంగా అవమానింపబడ్డావని కాని-"

"పడితేనేం! పర్యవసానమో! ఇప్పటికన్నా తెలుసుకున్నావు. ఒచ్చిన నష్టం యేమీలేదు. జీవితంలో యెన్ని అవసరంలేని పశ్చాత్తాపాలు! వకీలు వవు తెలుస్తుంది. నిజం తెలీకండానే అట్లా కుములుతో చచ్చిన వాళ్ళెందరు? మొపాసా 'నెక్లెస్' కథ యెంత నిజం! ఎంత విషాదం!"

"అవును మరి నన్ను విశాలాక్షితో మాట్లాడొద్దని యెంత జాశ్రీముం (ప్లీడ్) చేశావు! నా శ్రేయస్సు కోరేనా? కాక నీకు ఛాన్సుకా! దొంగ మాటలూ నువ్వూ!"

"అదే లోకం తెలీని అంధత్వం. మనుష్య స్వభావం తెలీని మూర్ఖం. ఎప్పుడో విశాలాక్షి ప్రియుణ్ణయినానని. మొదటినించీ నా నిజాయితీని, స్నేహాన్నీ సందేహించడం అన్యాయం, సరే, అసలు యెంత సంకుచిత దృష్టి!"

"ఓ, అప్పుడు కాదా?"

"విను మరి. నువ్వు పంపితే, నీ స్నేహంవల్ల అక్కడికి వెళ్లాల్సి ఒచ్చిందని, ఆ పిల్లమీద చాలా కోపంతోనే వెళ్ళాను. అటు తరువాత ఆర్నెల్లుగావును కాలేజీలో వున్నాము. ఆ ఆర్నెలల్లలో నీతో మళ్ళీ మాట్లాడలేదుకదూ ఆ పిల్ల, నువ్వు ఎంత ప్రయత్నించినా?"

"అవును. బెదిరిపోయింది పాపం!.... పాప మేమిట్లే - తప్పుడు....."

"ఆగు. అంతమాటే పవిత్రమైన నీ నోటినించి! నీ మీద విశాలాక్షికి ప్రేమ అంటావా లేదా?"

"కాక....కాదు....వుండు దానికి ప్రేమేమిటి? నేను ఉత్త foolని అయినాను."

"కాదు. నిజంగా చాలా ప్రేమ."

"నీతో చెప్పుకుందా? ఎప్పుడు? నీ కింద....."

"ఆపుకో కోపం. చచ్చిపోయింది. ఇప్పుడా....అవును. నాతో చెప్పింది. అప్పుడే కాదు చచ్చిపోయేవరకూ నీ జ్ఞాపకం గొప్పగా నిలిచింది ఆమెలో, నీతో ఆమె అబద్ధం చెప్పలేదు. నిజమే నీ మీద ప్రేమ."

"నిజమైతేనేం! అబద్ధమైతేనేం! ఏ మొచ్చింది?"

"ఏం రావాలి?"

అనేటప్పటికి శ్యామారావుకి జవాబు తోచలేదు తనకి యేం కావాలని వుందో. ఆ ఆశ వుందని తాను కూడా ఒప్పుకోలేడు.

"ఏం లేదులే. పోనీ నాతో స్నేహంగానన్నా వుందా?"

"ఛీ ఊరుకో. ఏ మొచ్చిందట? ఏం వొచ్చేట్టు ప్రవర్తించావు? స్నేహమా? ఆ వయసులో వుత్త స్నేహం యెవరికి కావాలోయ్? తమ వాంఛ లేమిటో సరిగా తెలుసుకుని, వాటికోసం ప్రయత్నించే ధైర్యం లేని వాళ్ళ సంగతి ఇట్లానే అవుతుంది."

"ఏం చెయ్యాలంటావు? ఆడపిల్ల ప్రేమ అనగానే, నీకుమల్లే రోడ్డుమీద యెదురు వెళ్ళి మీద పడమంటావా?"

"కాకపోతే ఆ పిల్లని నీపైన పడమంటావా? గోడమీద పేర్లు చూచి జడుసుకున్న వాడికి నీకు ఆడపిల్లలేమిటి? అసలు గోడ మీదికి పేర్లు రానిచ్చిన వాడికి, ఆ పేర్లు కలవడం తప్ప......"

"ఇంకేమీ కలవలేని వాడికి!" అని వెక్కికించాడు శ్యామారావు.

"వుండు. అవును, ఇతరుల మీద నిందలెందుకు? నువ్వు ఆనాడు నన్ను విశాలాక్షి ఇంటికి పంపకపోతే ఈ కథ జరగనే జరక్కపోను."

"ఓహో! అదీనేనే?"

"అవును. ఆ తండ్రి నన్ను మెడ పట్టుకుతోస్తే గుమ్మం అవతలపడ్డాను. ఆకస్మికంగా జరిగింది ఆ పని. చివ్వున లేచి ఒక్క దూకు దూకాను ఆ ముసలాయన వేపు కాని విశాలాక్షి అడ్డుపడ్డది. జ్ఞాపకం వుందా?"

"విశాలాక్షి అడ్డుపడ్డదని నువ్వు చెప్పినట్టు లేదు."

"అవును. చెప్పి ఉండను. అసలు ప్రారంభం అదే. ఆ మసకలో సరిగా చూడక తండ్రి అనుకుని ఆ పిల్లను గట్టిగా తోసివొచ్చాను. ఆ నిమిషాన తెలిసింది అది స్త్రీ శరీరమని, పైగా నన్ను అడ్డుపెట్టడానికి నా వేపు చేతుల జాచి నిలుచున్న పిల్లని ఎక్కడ తోసి ఉంటానో ఆలోచించుకో. ఆ స్పర్శని నా చేతులు మరిచిపోలేదు. రాత్రంతా కలలు కన్నాను. నువ్వు నన్ను ఓదారస్తున్నావేగాని, నా చేతులు నా కలలోకి పంపే ఆనంద తరంగాలలో అవమానానికి నా మనసులో స్థలమే లేకపోయింది."

"తరవాత వెంటపడ్డావా."

"లేదు. నా చేతుల స్పర్శని విశాలాక్షి రొమ్ములు కూడా మరిచి పోలేదు. మనసంతా నీ మీద, ఒళ్ళు......"

"నీ మీద,"

"అవును. ఒంటికి నా మీద కాంక్ష."

"ఒంటికంతా కాదుగా!"

"తక్కిన సంగతి నేను చూచుకున్నాగా!"

"అరి నీ తస్సాగొయ్యా! ఎట్లా? ఏం చేశావు?"

"నేనేం చెయ్యలేదు. నాకు అనుభవం లేదు. నువ్వు ఆమెకి లెన్డు చేసిన కెమిస్ట్రీనోట్సు ఆమె దగ్గరే వుండిపోయింది. నీతో మాట్లాడకూడదుగా! ఆ పుస్తకం నా కిచ్చింది నీకు ఇమ్మని. ఇస్తూ "సరిగా చూసి ఇవ్వండి. లోపలయేమన్నా కాయితాలు మరిచిపోయినానేమో." అంది. అప్పటికీ నాకు అర్థం కాలేదు. ఆమె సామీప్యంలో పరవశత్వమేగాని, నా చేతుల అనుభావాన్ని, కళ్ళతో పునస్మరణ చేసుకుంటున్నాను, నా మనసులో ఆ పమిటనీ; జాకెట్టునీ, ఇంకా అడుగున వున్న పొరలనీ తొలగించి."

"లోపల చీటీ పెట్టిందా?"

"ఊ."

"ఏం? ఏమీ చాతకాదంటివి?"

"నీకు అట్లాంటి చీటే ఒకటి రాసివుండకూడదా? అని నీ యేడుపు. రాస్తే యేం చేసేవాడివి? యేం? చెప్పు.....అసహ్యించుకునే వాడివి."

"ఏమో! యేం చేసేవాణ్నో!"

"ముందే తెలుస్తుంది ఆ సంగతి ఆడపిల్లలకి. ఇంకా పురుషుడంటే తెలీనప్పుడు కూడా, అందుకనే నీకు రాయలేదు."

"ఏమో! ఎట్లా తెలుసు?"

"ఇప్పుడన్నా తెలీటంలేదా నీ మనసుకి నువ్వేం చేసేవాడివో?......

"పోనీలే ఇప్పు డెందుకంతా. ఆ సాయంత్రం....."

"ఆ చీటీలో యేముంది.?"

"అవును ఆ చీటీ చూసి - యేం రాసిందంటే - నా మూలాన నువ్వు చాలా అవమానపడ్డావు. తలచుకున్న కొద్దీ నాకు అవమానంగా వుంది. మరి నన్ను యెట్లా క్షమిస్తావో! నీ బాధని పోగొట్టేందుకు నేనేం చెయ్యగలను? అని. అంతే. నా ఒళ్ళు పరవశమయింది."

"ఏముంది ఆ చీటీలో అంత ఒళ్ళు పరవశం కావడానికి?"

"చీటీలో యేం లేదులే. నా దగ్గిర ఆమె నుంచున్నప్పటి చూపులోనూ, మాటలోనూ వుంది కథ అంతా, 'నండూరి' వర్ణించాల్సిందే."

"కనుబొమ్మ సూడాలి - కతలు తెలియాలి."

"కథల్లో కావ్యాల్లో ప్రియుల మధ్య గొప్ప గొప్ప సంభాషణ పెడతారా? అట్లా యే ప్రియులూ మాట్లాడరు ప్రపంచంలో!"

"నీ కెలా తెలుసు."

"ఇందరు స్త్రీలలో - ఇన్ని రకాల వాళ్ళలో ఒక్కరూ నాతో అట్లా మాట్లాడలేదు. నాకు ఎప్పుడూ ఆ మాటలు రాలేదు ఏ స్త్రీతోనూ. పనులు చాతనైన వాళ్ళకి మాటలతో యేం పని? వుత్త మామూలు లోకాభి రామాయణం మాట్లాడతారు. కాని ప్రేమను మాట్లాడరు. ప్రేమని నోట్లోంచి కార్చుకోరు యెవరూ. అంతా చూపులో, మాట తీరులో, దేహ భంగిమలో ముఖవర్చస్సు మార్పుల్లో కనిపిస్తుంది. అది కథకు డెలా పట్టుకోగలడు? అందుకని అసహజమైన సంభాషణ పూర్వకంగా ఆ effect తెప్పించాలని చూస్తాడు."

"సరేలే. నీ గొడవ కానీ."

"ఆమెకి రాశాను, 'నీతో మాటాడాలి" అని, దానికి జవాబులేదు. వారం తరువాత ఆ సాయంత్రం తన యింటికి రమ్మంది అప్పటికి వెళ్లి యేం మాటాడతానో నాకు తెలీదు. వెళ్లాను."

"తండ్రీ?"

"ఏమో! నే నాలోచించ లేదు. అదంతా ఆమెకు వదిలేసి వుంటాను."

"చాలా పెద్ద మనిషివి!"

బైట అరుగు మీదే నుంచుని ఉంది. పక్క సందులోంచి రమ్మని చెయ్యి వూపింది. ఆ వేపున తలుపు ఉంది. గడియ తీసింది. లోపలికి వెళ్ళాను. సంజ చీకటి దీపం వెలిగించలేదు. కుర్చీ, బల్లా, పుస్తకాలూ కనిపించాయి. ఆమె స్టడీ రూం అనుకున్నాను.

"రా కూచో. ఏమిటి?" అంది.

"నా నోటి నుంచి రాలేదు. ఆమె చీర నించి, తలలో మొగలి రేకుల నించి పరిమళం. కూచున్నాను. ఆమె కుర్చీకి పక్కగా నా దగ్గిరే నుంచుంది.

"మాటాడవేం?" అంది.

"ఆలోచిస్తున్నాను."

"అంత ఆలోచించాలా!" నవ్వింది.

"నా థాట్సు ఆగిపోయినాయి" అన్నాను.

"ఏం?"

తెలెత్తి ఆమె కళ్ళల్లోకి చూసాను.

ఇలాంటివి యెన్నో జరుగుతాయి? అది అడగకు. నాకూ తెలీదు. మన పూర్వీకుల నించి రేస్‌లోనే వస్తున్నాయేమో! కాదు మృగాలతో వృక్షాల నించి కూడా తెలుస్తుందేమో! ఆ వాతావరణంలోనే మన మనసుకి తెలీకుండానే యెక్కడో లోపల పరస్పరంగా తగులుతుంది వాంఛ. వాళ్ళకి తెలీకుండా కూడా, లోపలి వాంఛ పిలుస్తుంది. పై మనసులు లేక-లోపలి ఏ ప్లేన్ లోనో-పిలుపులు అందుకుంటాయి." అని ఆగి-"ఒక్క నీత్యంధులకు తప్ప" అని నవ్వాడు రాజయ్య.

"ఊఁ......"

"కుర్చీ చేతిమీది నా చేతికి, నుంచున్న ఆమె చేతివేళ్ళు తగిలాయి. ఏ చెయ్యి కదిలిందో యేమో! అంతే. వేళ్ళ మధ్య వేళ్ళు. చూపుల మీద చూపు, బెదురుతోనే, ఆమె చెయ్యి పట్టుకుని లాగాను, యేమీ పాయిన్టు లేకండానే ఆమె నా ఒళ్ళో వుంది. తక్కింది ఆమె పిరుదులు కింద నా ఒడి మాటాడింది. నా ఎదురుగా తిరిగి నా మీద ఒరిగింది. నా

కళ్ళు మూతలు పడ్డాయి. ఏమిటి, శ్యామారావ్! మనం అమృతులమని అనుమానించాలా? ఆ అనుభవం! కిటికీలోంచి దేవతలు పూలు చాల్లా రనుకో నా మీద. యేన్నేళ్ళు బతుకు, ఆ నిమిషం మళ్ళీ రాదు. తరవాత యెందరు స్త్రీలని తెచ్చుకో, ఆ మొదటి స్త్రీ స్పర్శ అంతే. లేచింది, నా భుజంమీద వేళ్ళు అలానే ఉన్నాయి.

"చాకలి వొస్తాడు దీపం పెట్టడానికి. వెళ్ళు" అంది.

"మరి....."

అక్కడ లేదు. లోపలికి వెళ్ళింది. నేను వొచ్చేశాను. అంటే నా గదిలో వున్నాను గనక వొచ్చేశా ననుకున్నాను."

"నీ 'మరి'.....అలాగే వుండిపోయింది."

"అంతే. మళ్ళీ పలుకులేదు ఆ పిల్లనించి. పదిహేను రోజులయింది. వీలుపడలేదేమో! ఎవరన్నా వొచ్చారేమోనని. కాని పలకలేదు. కాలేజీలోనన్నా నా వంక కన్నెత్తి చూడలేదు. పదిరోజుల చూసి రాత్రులు ఆమె ఇంటిచుట్టూ తిరిగాను. ఏం లాభం? చీటీ రాశాను. జవాబు లేదు. ఎట్లా అందివ్వను చీట్లు నా వంక రానిదానికి? రాత్రులు మాని సాయంత్రాలు ఆ సమయాల్లోనే వెళ్ళాను అటు, ఇంటి వాళ్ళ కళ్ళు తప్పించుకుంటో. బిచ్చగాడి మల్లే చీకట్లో పోదామా? ఇట్లాంటిపన్నాగాలు ఆలోచించాను."

"కావలిస్తే ఆ పిల్లే పిలుస్తుందని యోచించే బుద్ధిలేక పోయింది నీకు."

"అవును. అందువల్లనే జయం లభించింది. ఆడవాళ్ళ వ్యవహారాల్లో అట్లాంటి వివేకం వుందా, నోట్లో కరక్కాయే......రాత్రులు ఆ గదిలో చదువుకునేట్టు లేదు. దీపం వుండదు. మరి రాత్రి చాకలి దీపం తెస్తాడంది, మరి ఇప్పుడు యెందకు ఆ గదిలో రాత్రులు చదువుకోడం మానేసింది? అని కోపం వచ్చింది నాకు. కాని ఆ పిల్లకి నే నొస్తానని భయమన్న స్పష్టమైన సంగతి తెలీలేదు నాకు. స్త్రీ భయపడ్డాదా, ఇంక లొంగిపోవడానికి అట్టే శ్రమపడనక్కర్లేదనీ, ఆనాడు తెలీదు. నన్ను తప్పించుకుంటోందని కోపం.

"దాంతో 'డెస్పరేట్' అయినాను. ఓ సాయంత్రం చీకట్లో వెళ్ళి సందులో ఎవరూ లేకుండా చూసి తలుపు దబదబా బాదాను. లోపల్నించి చాకలిగావును 'యెవరు?" అంటూ తలపు తెరుస్తున్నాడు, పరుగెత్తి వెళ్ళి పోయినాను, నాకు చదువులేదు, యేంలేదు. అదే పని-అదే యోచన. నాలుగు రోజుల ఆగి మళ్ళీ అట్లానే తలుపు కొట్టాను. 'యెవరు' అంది కోపంతో విశాలాక్షి. ఇంకా గట్టిగా కొట్టాను. కిటికీ దగ్గిరకొచ్చి తొంగి చూసింది. నేను కనపడలేదు, చూసి తప్పుకున్నాను. మళ్ళీ తలుపుకొడుతూ, 'నువ్వు తెరిచిందాకా వదలను' అన్నాను. ఆ చప్పుడికి యెదురింట్లో యెవరన్నా చూస్తారని కూడా ఆలోచించలేదు. లోపలికి తల తీసుకుంది ఇనుపకమ్ములనించి, నిశ్శబ్దం. తలుపు దగ్గిరిగా నుంచుని- "ఎందుకు?" అంది.

"తలుపు తియ్యి చెపుతాను."

"ఇప్పుడెట్లా? మనుషులు."

"ఎప్పుడు ఐతే."

"ఇంకో గంటపోయి."

"నిజమా?"

"ఊ....చూడు. గదిలో దీపం కనపడితే తలుపు కొట్టకు కనపడకపోతే మెల్లిగా కొట్టు. అంత చప్పుడేమిటి?" అంది.

ఆ గంట యెట్లా గడిపాను? అబద్ధమా? మోసం చేస్తుందా? తన్నిస్తుందా? ఈ ఆలోచనలన్నీ రావలసిందే. ఆ వయసులో రావు. అదంతా వయసు ముదిరినాక. గంటకే వెళ్ళానో, ఇంకా ముందుగానో; గదిలో పెద్ద దీపం. కానీ యెవ్వరూ వున్నట్టులేరు. మళ్ళీ పోవడం-ఓ గంట జరిగిందనుకుని ఐదు నిముషాలకే రావడం.....అట్లా యెన్నిసార్లో! మరి ఎన్ని గంటలయిందో! దీపం లేదు. నిశిరాత్రిలాగుంది. జన సంచారమే లేదు. ఆ తలుపు అవునోకాదోకూడా తెలీదు. మెల్లిగా చప్పుడు చేశాను. ఏమీ చలనంలేదు ఇంకొంచెం గట్టిగా. ఉహు. ఏం చెయ్యను? చూశావా? ఎంత మోసం చేసిందో! కసి ఎక్కువయింది. దీన్ని ఒదలకూడదు. ఇంటికి ఎట్లా వెళ్ళను? ఎట్లా నిద్రపోను? తెగించి ఆ మెట్లమీద కూచున్నాను. ఏం ఆశో తెలీదు. ఎదురుగా రంగులు మారేనక్షత్రం వెలుగుతోంది. కుంటి కుక్క తిండికోసం వెతుక్కుంటోంది. మా అమ్మ చూస్తే ఆ స్థితిలో-అనుకున్నాను. ఇట్లా ఏవో అర్థంలేని ఆలోచనలు కాని యవ్వనం నిద్రపట్టింది గావును తలుపుమీద ఒరిగాను గావును. రెక్క తెరుచుకుంది. వెనక్కి పడ్డాను. అప్పటికి తెల్లారుతోంది ద్వాదశినాటి చంద్రవంక ఉదయించింది అని ఈ నాటికీ జ్ఞాపకం రాలేదు. నిలుచుని మెల్లిగా నడిచాను. ఏం లాభం? ఎవరుంటారు? మోకాళ్ళకి మంచం కొట్టుకుని కాళ్ళల్లో నరాలు జిల్లుమన్నాయి. మూలిగి మంచంమీద పడ్డాను. కాని విశాలాక్షి మీద....నన్ను గట్టిగా కావిలించుకుని, నామీదికి దొర్లింది....."

"ఊ."

"అంతే. ఏం ఊ? తెల్లారుతున్నా నన్ను ఒదల్లేదు ఆ పిల్ల. మర్నాడు కూడా నేను రావడానికీ ఒప్పించాను చాలా బలవంతంమీద. నాలుగో రోజున నువ్వు నా గది కొచ్చి అర్ధరాత్రిదాకా బాతాఖానీ వేశావు. నాతో నీ విరహం చెప్పుకుంటావు. ఏం చెప్పను నీకు? నిన్ను ఒదిలించుకునేప్పటికి నా పెద్దలు దిగొచ్చారు. ఇంకొంచెం సేపయితే నిన్ను తన్ని గెంటేద్దును. నేను వెళ్ళేప్పటికి....చీకట్లోనా పెదిమలు తగిలేప్పటికి చెక్కిళ్ళన్నీ తడి.

"ఎందుకు?" అన్నాను ముద్దులతో నింపేస్తో.

"నువ్వు రావేమోనని" అంది దీనంగా.

నిన్ను తిట్టుకున్నాను.

అటు తరవాత నన్ను బతిమాలడం, ప్రతి రాత్రి రానేమోనని భయాలు. అనవసరంగానే ననుకో. కాని అక్కడ మెత్తదనం కనిపెట్టి దొంగబెట్టు చాలా చేశాను. పరీక్ష చివరిరోజు వరకూ మహారాజులాగా అనుభవించాను చీకట్లో, వెన్నెట్లో."

ఆగాడు రాజయ్య. శ్యామారావు వింటున్నాడనే మరిచిపోయాడు. శ్యామారావు కదల్లేదు. బల్లమీద paper weight (పేపర్ వెయిట్) వంక చూస్తున్నాడు. రాజయ్య మళ్ళీ చెప్పాడు-ఈసారి ఆగుతో నెమ్మదిగా.

"రాత్రి పదకొండింటికి వెళ్ళానా, తెల్లారకట్ట ఐదింటి వరకు ఇద్దరికీ నిద్ర వుండేది కాదు. నెలలో ఇరవై ఆరురోజులూ అదే దీక్ష! పరీక్షలకి ఒకటే చదుతున్నానని వెక్కిరించేవారు మీరందరూ, జ్ఞాపకముందా? పగలు క్లాసులో విశాలాక్షి కునికిపాట్లు పడి చివాట్లు తింటోవుంటే నాకు జాలేసేది. ఆ యేడు యెట్లానూ పరీక్ష తప్పుతుంది. నాలుగు రాత్రులన్నా క్లుప్తంగా పాఠాలన్నీ వఙజాశ్రీఖఉఅ (ఎక్స్‌ప్లెయిన్) చేద్దామనుకున్నాను. ఆ ఉద్దేశ్యంతోనే బయలు దేరేవాణ్ణి, కాని పుస్తకం తెరవక ముందే యెవరో ఒకరం ...... ఆ పక్క అక్కడ కనపడు తున్నంతసేపూ చదువు ఎట్లా సాగుతుంది మా వెర్రిగాని! అట్లా నెలల తరబడి ప్రతి రాత్రీ కొత్తగా రతి సమరానికి తలపడగల ఆడవాళ్ళే కనపడరు. మా పెద్ద అమ్మాయిని మిటిటరీకి వెళ్ళివొచ్చిన అబ్బాయి కిచ్చాము. అంటే కనపడడమూ అట్లానే వుంటాడులే. పెద్దమీసాలు, రాయివంటి ఛాతీ. రెండు నెలల్లో పీనిగై పుట్టింటికి చెప్పకండా పరిగెత్తుకొచ్చింది, ఎందుకు వొచ్చావే అంటే చెప్పలేదు. వెనకాలే మర్నాటికి మొగుడు సిద్ధం అతను ఒకటే నవ్వు. 'మీ అమ్మాయి యెందుకు వొచ్చిందో అడగండి' అంటో. నిజంగా అది సమరమే మా మధ్య. విశాలాక్షి రాత్రులు ఓ రాక్షసి అయ్యేది. ఊడి విరబోసిన జుట్టూ, పెద్ద శ్వాసా, తుపానులో అలలమల్లే యెగిరిపడే రొమ్మూ....ఏం ఆడిపోయేది! ఆవేశం పట్టలేక నన్ను కొరికిందంటే, రక్తంతో షర్టు తడిసిపోయేది. ఎక్కడ పడితే అక్కడ ఒళ్ళు తెలీక......"

"ఇంత వ్యవహారం జరుగుతో వుంటే నాకేం తెలీదుకద! వెర్రివాడి మల్లే కలలు కంటున్నాను. పరీక్షలై నాక ఆమెని కలుసుకోవచ్చుననీ, ఆమెనే పెళ్ళి చేసుకుందామనీ, నా మల్లేనే మనసు పెట్టుకుని కూచుందనీ, ఎందుకంటే, మాది ఉత్త స్నేహమనుకోకు. మా మధ్య ఏమీ జరక్కపోయినా మా మనసులు మాటలతో కాకుండానే యెన్నో అన్యోన్యాలు కలుపుతున్నాయి. చూపుల మాట్టాడాయి, చాలా వాగ్దత్తాలు చేశాయి. ఎంత మోసం!"

"ఆమెకి నీమీద గొప్ప ప్రేమ అని చెప్పాను కాదూ?"

"సరేలే. ఆ విశాలాక్షి సరే. ఆమె నాతో మాట్టాడటంలేదనీ, వీలైనప్పుడు కూడా నా నించి పెడమొహం పెట్టి తిరుగుతోందనీ, నా భయాలు, ఆశలు, నిరాశలు, యెన్ని నీతో చెప్పుకునే వాణ్ణి! ఏ మెరగని, ఒకటీ తెలీని నంగనాచిమల్లే యెట్లా వినేవాడివి? పోనీ నాతో...."

"యెలా చెప్పవోయ్? నువ్వే ఆలోచించు."

"అవునులే కానీ, చెప్పు నీ కథ."

"పరీక్షలై నాక వారంరోజులు ఉండిపోయాను. కాని వెళ్ళక తప్పుతుందా ఇంటికి? ఏం ఏడ్చింది ఆ రాత్రి! ఆ జన్మకీ ముందు జన్మలకీ కూడా వాగ్దత్తాలు చేసుకున్నాం."

"అలాంటివాళ్ళు పెళ్ళిచేసుకోక పోయినారా?"

"ఈ కాలంలో ఐతే అంతే జరిగేది. కాని ఆ కాలంలో ఇంకా భయాలు, కులభేదం, పెద్దవారి అనుజ్ఞలు వగైరా. ఓ రెండేళ్ళలోనే కలుసుకున్నాము మళ్లీ. చక్రపాణి నా మిత్రుడు. మా అత్తవారి వూరు అదే. చూసుకునే వాళ్ళం. కాని నేను నా భార్యతో కొత్త కాపరపు శృంగారం. అదోరకం అనుభవం. అది మన స్వంతం. విశాలాక్షికీ భర్తతో అంతే ననుకుంటా. మా వాగ్దాత్తాలే చచ్చిపోయినప్పుడు, ఆ వూళ్ళోనే వున్నాను. అతాత్తుగా గుండె ఆగి, పోయినాడు ఇంకా బంధువు లెవరూ రాలేదు. దహనం చేయించి రాత్రి యెనిమిదింటికి వాళ్ళ యింటికే వొచ్చాను తల్లీ కూతురే యింట్లో నన్ను వెళ్ళవొద్దంది. వుండి పోయినానను రాత్రి నిద్రపోతో వుంటే ఏడుపు వినిపించింది. ఆ ఏడుపులు నాకు చాలా చికాకు, అసహ్యం. నేనే ఈ దేశానికి డిక్టేటర్ని అయితే, చచ్చినప్పుడు ఏడవకూడదని మొదట శాసనం చేస్తాను.

నన్ను చూడగానే విశాలాక్షి "ఇక నాకు దిక్కెవరు ?" అని బిగ్గరగా ఏడ్చింది.

"నేను వున్నాను, నిజం. నమ్ము" అన్నానో లేదో ఆనాటి రాత్రి వాగ్ధత్తాలు జ్ఞాపకం వొచ్చాయి.

"నువ్వా! నీ సంసారం, పిల్లలూ, పనీ....."

"ఆ రాత్రి మన ప్రమాణాలు...."

ఏడుపు మాని నావంక చూసింది. చిన్న చిరునవ్వు.

"ఇంకా జ్ఞాపకం వుందా?"

"ఏం? నువ్వు మరిచిపోయినావా?"

"లేదు. కాని, చిన్ననాటి మాటలు."

"అందుకనే అంతబలం, ఏమీ భయపడకు."

ఆ 'వీ', అది పూర్వం పిలిచేవాణ్ణి విశాలాక్షిని. ఆ మాట విని కంపించిపోయింది.

"ఆయనకి అన్నీ అప్పులు...."

"కానీ. నే నున్నాను."

"నిజమా?" అని నా చెయ్యి పట్టుకుంది. నేను ఆమె కన్నీళ్ళని తుడిచి ఓదార్చాను తరవాత ...... మళ్లీ మొదలు - అక్కడే ఆ చాప మీదనే.....ఏమిటి అట్లా చూస్తావు? ఏమీ చిత్రం కాదు. ఇట్లాంటి వ్యవహారాలు చాలా వరకు, భార్య నొప్పులు పడేప్పుడూ, భర్త చావులోనూ ప్రారంభ మౌతాయి. అప్పుడు హృదయం అసహాయస్థితిలో వుంటుంది గావును, ఏది దొరకినాఆధారంగా పట్టుకుంటుంది."

"తరవాత ?" అన్నాడు గాని శ్యామారవు, అతని మనసు ఎక్కడో ఉన్నట్టుంది.

"అంతే. ఆమెకి భక్తి వైరాగ్యాలుఎక్కువై, తన పాత జీవితంలో చేసిన పాపానికి-అంటే నాతో కలిసి-పశ్చాత్తాపంతో యాత్రలు బైలుదేరిందాకా, కోర్టు వ్యవహారాల మూలాన ఆమె మా యింటికి తరుచూ వొచ్చేది. చివరికి కూతుర్ని నాకు వొదిలి వెళ్ళింది రామేశ్వరం. అప్పటికి నాకూ ఆమె మీద పట్టు చల్లబడ్డది" అని ఇంకేం చెప్పటానికి లేక ఆగాడు రాజయ్య. శ్యామారావు వంక చూశాడు. ఎంతసేపయిందో, అతను తన ఆలోచనల్లోనే వుండిపోయి నట్టున్నాడు. చివరిదాకా విన్నాడో-లేదో.

ఎంత పొద్దుపోయిందో! కిటికీలోంచి వెన్నెన తివాసీ మీద నుంచి వాళ్ళ పాదాలదాకా పాకింది. రోడ్డుమీదనుంచి కూడా ఏమీ చప్పుడు లేదు. ఆ నిశ్శబ్దంలో బీరువాలో పుస్తకాలూ గోడలూ మాట్టాడ్డం ప్రారంభించాయనిపించింది. ఎంతసేపు కూచున్నారోఅట్లా మాట్లాడకుండా. శ్యామా రావుకి తనమీద చాలా కోపం, అసూయా, అసహ్యం కలిగాయి కావు ననుకున్నాడు రాజయ్య. త్వరలోనే, పాత స్మరణలలో అతనికి అశాంతి కలిగి లేచి వెళ్ళి కిటికీ దగ్గర నుంచున్నాడు చుట్ట వెలిగించాలని అనుకుంటో. ఒక తెల్లని మబ్బు చంద్రుడ్ని సమీపిస్తోంది. ఎంత ఒంటరిగా వుంటాడో చంద్రుడు నిశిరాత్రి! యవ్వనంలో తమకోసం వెలుగుతో, తమ రసికత్వాలకి మెరుగుపెట్టిన మిత్రుడు? ఇప్పుడు? చాలా ఒంటరి అనిపించింది జీవితం. వృద్ధాప్యం మొదలా! నిద్ర వొస్తోంది. కదలలేదు శ్యామారావు.

"On such a night as this" (ఆన్ సచ్ ఏ నైట్ యాజ్ దిస్) అన్నాడు రాజయ్య, ఆ నిశ్శబ్దాన్ని భరించలేక.

◆ ◆ ◆

*రచనాకాలం - 1951,*

*ప్రచురణ : (ఆరాత్రి కథలు) ఎమెస్కో ప్రచురణ, 1971*